నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ శనివారం 8-11-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:72 పేజీలు:6 వెల: రూ.1/-

**నేటి కందం- నేటికి అందం**

భారత నౌకాదళమువ
తీరుగ నిక్షాకు వచ్చి దేదీప్యముగా
చేరగ మన దేశం బిం
పారెడి జయమొంద గలదు ప్రత్యర్థులపై !!


(భారత నౌకాదళం లోకి క్రొత్తగా సర్వే నౌక ఇక్షాక్ చేరింది దీనితో మన నౌకాదళ బలం పెరిగింది)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

ఎన్నికల్లో తిట్లతోని
ఎందుకింకా గరంగరం
జూబ్లీ ప్రజల చేతిలోనే
జబర్దస్త్ గెలుపు వరం.
అభివృద్ధి సానుభూతి
అయే ప్రచారాల హోరు
కారు పరుగో హస్తవాసో
కడకు ఏదో ఒకటి జోరు



-వేల్పుల నారాయణ
9440433475

# 1937లో వందేమాతరం గేయంలో కొన్ని చరణాలను తొలగించారు : ప్రధాని మోదీ




న్యూఢిల్లీ, నవంబర్ 7:వందేమాతం జాతీయ గీతానికి 150 ఏళ్లు నిండాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంస్మరణ ఉత్సవంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ.. వందే మాతరం గీతంలోని కొన్ని ముఖ్యమైన చరణాలను 1937లో తొలగించినట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీని టార్గెట్ చేస్తూ మోదీ ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. విభజనకు చెందిన కొన్ని చరణాలను ఆ గేయం నుంచి తొలగించారని, ఇప్పటికీ లాంటి విభజన మైండ్‌సెట్ దేశానికి సవాల్‌గా మారిందని ప్రధాని మోదీ అన్నారు. ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో వందేమాతరం 150 ఏళ్లకు చెందిన సంస్మరణ స్టాంపు, నాణాన్ని ప్రధాని రిలీజ్ చేశారు.

భారత స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం ఈ దేశ స్వరంగా మారిందన్నారు. ప్రతి భారతీయుడి తమ మనోభావాలను ఆ గేయం ద్వార వ్యక్తపరిచారన్నారు. కానీ 1937లో దురదృష్టవశాత్తు, వందే మాతరం గేయంలోని కొన్ని చరణాలను తొలగించారని, వందేమాతర గీత విభజన దేశ విభజనకు బీజం వేసిందన్నారు. జాతి నిర్మాణం కోసం రూపొందించిన ఈ మహామంత్రం పట్ల ఎందుకు అన్యాయం జరిగిందో ఈ తరం యువత తెలుసుకోవాలన్నారు. ఇలాంటి విచ్ఛిన్నకర మైండ్‌సెట్ దేశానికి ఇప్పటికీ సవాలే అన్నారు. ఉగ్రవాదం పేరుతో శత్రువులు మన భద్రత, గౌరవంపై దాడి చేస్తే, అప్పుడు భారత్ ఎలా దుర్గ అవతారాన్ని ఎత్తిందో ప్రపంచ వీక్షించినట్లు పేర్కొన్నారు. వందేమాతర గీతం కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, ఈ దేశాన్ని కొత్త శక్తితో నింపుతోందన్నారు.

వందేమాతరం అంటే ఓ పదం, ఓ మంత్రం, ఓ శక్తి, ఓ కళ, ఓ పట్టుదల అని ఆయన అన్నారు. భారతమాత పట్ల ఇది భక్తికి నిదర్శనమన్నారు. మన చరిత్రను చాటుతూ.. మనకు కొత్త ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. అనుకున్నది సాధించలేనిది ఏమీ లేదని, భారతీయులు దేన్నైనా సాధించగలరని, జ్ఞానం..విజ్ఞానం.. సాంకేతిక నిండిన దేశాన్నినిర్మించాలన్నారు.

## రాష్ట్రంలో మరో ప్రమాదం.. కారును ఓవర్ టేక్ చేయబోయి అవతలి వైపు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు ప్రకాణికులు సురక్షితం...

న్యూఢిల్లీ, నవంబర్ 7:తెలంగాణలో మరో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. కారును ఓవర్ టేక్ చేసే క్రమంలో అదుపుతప్పిన బస్సు డివైడర్‌ను ఢీకొట్టి అవతలి వైపు దూసుకెళ్లింది. హైదరాబాద్ శివారు ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఔషాపూర్ వద్ద ఓ కారును ఓవర్‌టేక్ చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బస్సు అదుపుతప్పింది. డివైడర్‌ను ఢీకొట్టి అవతలివైపునకు దూసుకెళ్లింది. అవతలి పక్కన రోడ్డు చివరలో ఉన్న రైలింగ్‌ను ఢీకొట్టి బస్సు ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్‌చేశారు.

## ఉన్నత విద్యా సంస్థల సమాఖ్యకు హైకోర్టులో చుక్కెదురు

హైదరాబాద్, నవంబర్ 7: ఉన్నత విద్యా సంస్థల సమాఖ్యకు తెలంగాణ హైకోర్టు లో చుక్కెదురైంది. హైదరాబాద్‌లో రేపు(శనివారం) నిర్వహించే అధ్యాపక సభకు అనుమతి నిరాకరించింది న్యాయస్థానం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఉన్నందున సెక్యూరిటీ ఇవ్వలేమని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ క్రమంలో అధ్యాపక సభ అనుమతి కోసం హైకోర్టులో ఈయిఊఎ లంచ్ మోషన్ పిటిషన్ వేశారు. ఈ పిటీషన్‌పై జస్టిస్ శ్రవణ్ కుమార్ విచారణ జరిపారు.

అధ్యాపక సభకు ఎల్బీ స్టేడియం లేదా మరోచోట అయినా ఫర్లేదని అనుమతి ఇవ్వాలని ఈయిఊఎ లాయర్ కోరారు. అయితే, కాలేజీల బంద్‌ని రాష్ట్ర సర్కార్ ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించింది హైకోర్టు. ఈ సభకు అనుమతి ఇవ్వడానికి ఉన్న అభ్యంతరం ఏంటని న్యాయస్థానం ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రక్రియ ముగిసే వరకు హైదరాబాద్ సిటీలో భారీ సభకు అనుమతి ఇవ్వలేమని ప్రభుత్వ న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో అధ్యాపక సభకు వారం రోజుల తర్వాత అనుమతిపై నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# నిరంతర అభ్యాసమే విజయానికి మార్గం..

**–గవర్నర్, ఛాన్స్ లర్ జిష్ణు దేవ్ వర్మ**
**–నైపుణ్యంతో మరింత బలం**
**–భయం, అలసటను అధికమించాలి**
**–శాతవాహన యూనివర్సిటీలో రెండో స్నాతకోత్సవం**

కరీంనగర్, నవంబర్ 7: నిరంతర అభ్యాసంతోనే విజయం సాధ్యమవుతుందని, శ్రద్ధ, క్రమ శిక్షణతో లక్ష్యాన్ని చేరుకోవాలని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణు దేవ్ వర్మ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శాతవాహన యూనివర్సిటీ రెండవ స్నాతకోత్సవానికి తెలంగాణ గవర్నర్, ఛాన్సలర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. 25 మందికి పీహెచ్డీ పట్టాలతో పాటు 2018 నుంచి 2023 వరకు ప్రతిభ కనబరిచిన 161 మంది విద్యార్థులకు బంగారు పతకాలు గవర్నర్ అందజేశారు. ఈ సందర్భంగా గవర్నర్ విష్ణుదేవ్ వర్మ విద్యార్థుల ఉద్దేశించి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం విద్యార్థులను విజయం దిశగా తీసుకెళుతుందని అన్నారు. విద్యార్థుల మేధాశక్తియే వారి ప్రయోగశాలగా అభివర్ణించారు. విద్యార్థుల ఆలోచనలు, శ్రమ, సృజనాత్మకత వారిని సమాజంలో ముందుకు తీసుకెళ్తాయని తెలిపారు.

అవకాశం, సమానత్వం సృజనాత్మకతతో ఎదగాలని ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయానికి విద్యా రంగాల్లో, విద్యా ప్రమాణాలు నెలకొల్పాలని తెలిపారు. శాతవాహన విశ్వ విద్యాలయానికి న్యాక్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ దిశగా అధ్యాపకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి అని అన్నారు. విద్యారంగం బోర్డు, చాక్ పీస్ లకే మాత్రమే పరిమితం కావద్దని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యా రంగం సాంకేతికతతో ముందుకు సాగుతుంది అని అన్నారు. డిజిటల్ లెర్నింగ్ భౌగోళిక అవరోధాలను అవకాశాల మధ్య వ్యత్యాసాలను చెరిపివేసిందని తెలిపారు. ప్రతీ విద్యార్థి నైపుణ్యం, నిరంతర అభ్యాసాలె విజయానికి దోహదం చేస్తాయని అన్నారు. ప్రపంచ విజ్ఞానాన్ని ఆహ్వానించాలని, ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను




అందిపుచుకోవాలి అని వివరించారు. తెలంగాణ మట్టి పరిమళాన్ని మరువవద్దని పిలుపునిచ్చారు.

అందరూ సమానంగా జీవించే సమాజమే నిజమైన అభివృద్ధి అని తెలిపారు. ప్రతిభ ఎక్కడైనా వికసిస్తుందని,భయాన్ని, అలసటను అధికమించి ముందుకు సాగాలని అన్నారు. కృషితో ప్రతీ విద్యార్థి అభివృద్ధి సాధ్యమే అని అన్నారు. విద్యార్థి దశ నుండే సేవా మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సిలర్ జె.బి. రావు, శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ యు.ఉమేష్ కుమార్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ చేరుకున్న గవర్నర్ మొదటగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, డిపార్ట్మెంట్ వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. అనంతరం వందేమాతర గేయంతో కార్యక్రమాన్ని ప్రారంభించగా తదనంతరం బాలభవన్ విద్యార్థుల శాస్త్రీయ నృత్యం, అంద విద్యార్థుల పాటలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సెక్రట రి దానకిషోర్, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ లు అశ్విని తానాజీ వాకాడే లక్ష్మి కిరణ్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ జిల్లా ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## పట్టాలెక్కనున్న నాలుగు వందే భారత్ రైళ్లు.. నేడు గ్రీన్ సిగ్నల్ ఇవ్వనున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, నవంబర్ 7: భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చి వందే భారత్ రైళ్లు ప్రస్తుతం దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో దూసుకెళున్నాయి. రేపటి నుంచి మరో నాలుగు రైళ్లు పట్టాలెక్కబోతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభిం చనున్నారు. ప్రధాని శుక్రవారం వారణాసిలో పర్యటిస్తారు. ఈ సం దర్భంగా ఉదయం 8.15 గంటలకు నాలుగు వందే భారత్ రైళ్లకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. ఈ రైళ్లు వారణాసి-ఖజురహో, లక్నో-స హరాన్‌పూర్, ఫిరోజ్‌పూర్-ఢిల్లీ, ఎర్నాకులం-బెంగళూరు మార్గాల్లో రాకపోకలు సాగిస్తాయి. వేగవంతమైన ప్రయాణం, మెరుగైన కనెక్టవిటీని ఈ రైళ్లు పెంచుతాయని రైల్వేశాఖ తెలిపింది. గోరఖ్‌పూర్‌లోని నార్త్ ఈస్టర్న్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ పంకజ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ఆయా నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గించడంతో పాటు పర్యాటకం, వాణిజ్యాన్ని పెంచుతాయన్నారు.

బనారస్?ఖజురహో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ భారత్ రైలు.. ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లతో పోలిస్తే సుమారు 2.40 గంటల సమయం ఆదా అవుతుంది. ప్రయాణ సమయం తగ్గించడంతో పాటు మతపరమైన, సాంస్కృతిక పర్యాట కాన్ని ప్రోత్సహిస్తుందని, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశమైన ఖజురహోకు ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా చేస్తుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.

లక్నో-సహరాన్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ దాదాపు 7 గంటల 45 నిమిషాల్లో తన ప్రయాణాన్ని పూర్తి చేస్తుంది. ప్రయాణ సమయాన్ని దాదాపు గంట పాటు తగ్గిస్తుంది. ఈ రైలు లక్నో, సీతాపూర్, షాజహాన్‌పూర్, బరేలీ, మొరాదాబాద్, బిజ్నోర్, సహరన్‌పూర్ ప్రయాణికులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

ఫిరోజ్‌పూర్ నుంచి ఢిల్లీకి వందే భారత్ కేవలం 6.40 గంటల్లోనే చేరుకుంటుంది. బటిండా, పాటియాలా మధ్య కనెక్టివిటీని బలోపేతం చేస్తుంది. ఈ రైలు వాణిజ్యం, పర్యాటకం, ఉపాధి అవకాశాలను పెంచుతుందని, సరిహద్దు ప్రాంతాల సామాజిక-ఆర్థిక అభివృద్ధికి సహాయపడుతుంది. జాతీయ మార్కెట్‌లతో మెరుగైన అనుసంధానాన్ని సులభతరం చేస్తుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు.

దక్షిణ భారతదేశంలో ఎర్నాకు లం-బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణ సమయాన్ని రెండు గంటలకుపైగా తగ్గించనున్నది. ప్రయాణాన్ని 8 గంటల 40 నిమిషాల్లో పూర్తి చేస్తుంది. ఈ రైలు ప్రధాన ఐటీ, వాణిజ్య కేంద్రాలను కలుపనున్నది. నిపుణులు, విద్యార్థులు, పర్యాటకులకు వేగవంతమైన, మరింత సౌకర్యవంతంగా ఉంటుంది. ఇది కేరళ, తమిళనాడు, కర్నాటకలో ఆర్థిక కార్యకలాపాలు, పర్యాటకం, ప్రాతీయ సహకారం, అభివృద్ధిని బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా.. ప్రధాని నరేంద్ర మోదీ శుక్ర, శనివారాల్లో వారణాసి పార్లమెంట్ నియోజకవర్గంలో పర్యటిస్తారు. ఈ పర్యటనలోనే నాలుగు వందే భారత్ రైళ్లను ప్రారంభిస్తారు. ప్రధాని బనారస్ రైల్వే స్టేషన్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. శుక్రవారం సాయంత్రం మోదీ ప్రత్యేక విమానంలో బాబత్‌పూర్‌లోని లాల్ బహదూర్‌శాస్త్రి విమానాశ్రయానికి చేరుకుంటారు. ఆయనకు గవర్నర్ ఆనందిబెన్ పటేల్, సీఎం ఆదిత్యనాథ్ స్వాగతం పలుకుతారు. ఈ పర్యనలో ఆయన విద్యావేత్తలు, సామాజిక, వివిధ రంగాలకు చెందిన నిపుణులు సహా 3200 మందితో సంభాషిస్తారు.

# విద్య అనేది సేవ.. వ్యాపారం కాదు

**–ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, నవంబర్ 7: ప్రైవేటు విద్యాసంస్థల నిర్వాహకులు తమాషా చేస్తే తాటతీస్తానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. విద్య అనేది సేవ.. వ్యాపారం కాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు సేవ చేయడం లేదు.. వ్యాపారం చేస్తున్నాయని సీరియస్ అయ్యారు. ఇవాళ (శుక్రవారం) గాంధీభవన్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.



విద్యార్థులకు నష్టం కలిగిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కాలేజీలను బంద్ చేయించిన వారితో చర్చలు ఎలా ఉంటాయి.. అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు.

కాగా, ఫీజురీయంబర్స్‌మెంట్‌పై ప్రైవేటు విద్యాసంస్థలు ఇటీవల బంద్‌కు పిలుపునిచ్చాయి. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశాయి. లేకపోతే నిరవధిక ఆందోళన చేపడతామని హెచ్చరించాయి. తెలంగాణ ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో విద్యాసంస్థలను కొనసాగించడం చాలా కష్టంతో కూడుకున్నదని ప్రైవేటు విద్యాసంస్థలు ఆవేదన వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే ప్రైవేటు విద్యాసంస్థలపై సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్ అయినట్లు తెలుస్తోంది.

## కరీంనగర్ కలెక్టరేట్లో ప్రభుత్వ శాఖల స్టాల్లు పరిశీలించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



కరీంనగర్, నవంబర్ 7: శాతవాహన యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ చేరుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మొదటగా పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, డిపార్ట్మెంట్ వారీగా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పరిశీలించారు. అనంతరం వందేమాతర గేయంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలభవన్ విద్యార్థుల శాస్త్రీయ నృత్యం, అంధ విద్యార్థుల పాటలను ఆలపించారు.

జిల్లా సమగ్ర స్వరూపంతో పాటు జిల్లా విశేషాలను కలెక్టర్ పమేలా సత్పతి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరి దానకిషోర్, సీపీ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకాడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సినీ హీరో సుమన్ చేతుల మీదుగా కరాటే బ్రోచర్ ఆవిష్కరణ



కరీంనగర్, నవంబర్ 7: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా ఓపెన్ టు కరాటే ఛాంపియన్షిప్ పోటీలకు సినీ హీరో సుమన్ తల్వార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డిసెంబర్ 14వ తేదీన కరీంనగర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో జరగబోయే తెలంగాణ స్టేట్ లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్ పోటీల బ్రోచర్ ను హీరో సుమన్ తల్వార్ ఆవిష్కరిం చారు.

ఈ సందర్భంగా గోజుర్యో కరాటే డు అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ఇన్స్ట్రక్టర్ శసురభి వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన వెయ్యి మంది క్రీడాకారులు పాల్గొననున్నారని తెలియజేశారు. ఇం దులో ఫైట్, కటా, వెపన్, టీం కటా అంశాలలో అంశాలలో బాల బాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహిం చడం జరుగుతుందని తెలి పారు.

ఇందులో పాల్గొనే క్రీడాకారు లకు ఉచిత భోజన వసతి కల్పించడం జరు గుతుందని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో హన్సి అనంతన్, సీనియర్ కరాటే మాస్టర్లు కే వసంత్ కుమార్, ఎస్ సంపత్ కుమార్, కే మొండయ్య, ఈ శ్రీనివాస్, రాజిరెడ్డి, ఎంఎ మన్నాన్, లింగయ్య, శ్రీనివాస్, ప్రసన్న కుమార్, ఇంద్ర సురభి, అన్వేష్ సురభి, వినీష్, ఎస్ అరుణ్ పాల్గొన్నారు.

## అభిమానాన్ని సొమ్ము చేసుకునే వీళ్లు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారు..


**– క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ పై సిపి సజ్జనార్ ఆగ్రహం**

హైదరాబాద్ నవంబర్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: బెట్టింగ్ మహమ్మారికి ఎందరో యువకులు బలవుతున్నారని సిపి సజ్జనార్ తెలిపారు. బెట్టింగ్ వల్ల యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ పై సిపి సజ్జనార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభిమానాన్ని సొమ్ము చేసుకునే వీళ్లు ఆదర్శ ఆటగాళ్లు ఎలా అవుతారు? అని బెట్టింగ్ భూతాన్ని ప్రచారం చేసిన సెలబ్రెటీలు బాధ్యులు కారా? అని ప్రశ్నించారు. బెట్టింగ్ వల్ల వేలమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సజ్జనార్ ఆవేదన వ్యక్తం చేశారు.

**డా॥ అంబల్ల జనార్ధన్ వజ్రోత్సవ అభినందన సమితి**

**ఆహ్వానం**

**డా॥ అంబల్ల జనార్ధన్ గారి వజ్రోత్సవం**
**శ్రీమతి అంబల్ల సువర్ణ-డా॥ అంబల్ల జనార్ధన్ గార్ల వివాహ స్వర్ణోత్సవం** మరియు



డా॥ అంబల్ల జనార్ధన్‌గారి కథానికా సంపుటి
"ప్రాణధార"
మరియు
"వజ్రోత్సవ అభినందన సంచిక"



**ఆవిష్కరణ**

**సభాధ్యక్షులు** : **శ్రీ బైస దేవదాసు**
"ప్రాణధార" కథా సంపుటి ఆవిష్కర్త — సంపాదకులు: నేటినిజం దినపత్రిక
**గౌరవ అతిథి** : **ఆచార్య డా॥టి.గౌరీశంకర్**
అభినందన సంచిక ఆవిష్కర్త — అధ్యక్షులు:అం.జ.వజ్రోత్సవ అభినందన సమితి
**విశిష్ట అతిథి** : **శ్రీ రఘుశ్రీ**
కార్యదర్శి: అం.జ.వజ్రోత్సవ అభినందన సమితి.
**ఆత్మీయ అతిథి** : **శ్రీ పి. చంద్రశేఖర ఆజాద్**
ప్రముఖ రచయిత, కవి.
**ఆత్మీయ అతిథి** : **శ్రీ ఎం.వి. రామిరెడ్డి**
ప్రముఖ రచయిత, కవి,
అధ్యక్షులు:రాంకీ ఫౌండేషన్
**ఆత్మీయ అతిథి** : **శ్రీవి.పి.చందన్‌రావు** ప్రముఖ కవి,వ్యాఖ్యాత

**తేది: 09-11-2025, ఆదివారం, ఉ॥ 11.00 గంటలకు**

**వేదిక:** శ్రీ రాజ రాజేశ్వర-శ్రీ వేంకటేశ్వర మందిర ప్రాంగణ,ధర్మోరా గ్రామం, మోర్తాడ్ మండలం, నిజామాబాద్ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

Dharmora on Google Maps
https//maps.app.goo.gl/ZeMkXAKNFyTKWKnzb
ధర్మోరా గ్రామం, హైద్రాబాద్ నుండి దాదాపు 200 కి.మీ.
నిజామాబాద్ నుండి 45 కి.మీ,
ఆర్మూర్ నుండి దాదాపు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.
ముందస్తు సూచన ఇచ్చినచో ఆర్మూర్ నుండి తేది 09-11-2025న ఉ॥10 గంటలకు ఒక కారు, 10-45 గంటలకు ఒక కారు ఏర్పాటు చేయగలము.

**ముఖ్య గమనిక:** దయచేసి కానుకలు, శాలువాలు, పుష్పగుచ్ఛాలు తేవద్దు. వాటి కంటే సభా ప్రాంగణంలో ఉంచిన డా॥అంబల్ల జనార్ధన్ గారు రచించిన కథల పుస్తకాలు రాయితీ ధరపై కొని, చదివి, స్పందిస్తే మాకు సంతోషం.

**–డా॥ అంబల్ల జనార్ధన్ వజ్రోత్సవ అభినందన సమితి.**

# ఎక్స్-కిరణాలతో రోగ నిర్ధారణ సులభతరం !

## (08 నవంబర్ "ప్రపంచ రేడియోగ్రఫీ దినం" సందర్భంగా)

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి. వ్యాధి నిర్ధారణ, ఇమేజింగ్ టెక్నాలజీలు, శస్త్ర చికిత్సలు, ఔషధ రంగాల్లో పెనుమార్పులకు నాంది పలుకుతున్నాం. నేడు ఎక్స్-రే, ఎంఆర్ఐ లాంటి ముఖ్యమైన రేడియేషన్ ఆధారిత టెక్నాలజీలను రోగ నిర్ధారణలో వాడడంతో చికిత్సలకు మార్గం సుగమం అవుతున్నది. అత్యాధునిక వైద్యరంగంలో రేడియోగ్రాఫర్లు, రేడియోలాజిక్ టెక్నాలజిస్టుల పాత్రను కొనియాడడానికి ప్రతి ఏట 08 నవంబర్‌న విశ్వమానవాళి "ప్రపంచ రేడియోగ్రాఫర్స్ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది. వరల్డ్ రేడియోగ్రఫీ డే-2025 ఇతివృత్తంగా "రేడియోగ్రాఫర్స్ : కనిపించని దానిని చూడగలగడం (రేడియోగ్రాఫర్స్ : సీయింగ్ ది అన్‌సీన్)" అనబడే థీమ్‌ను తీసుకొని ప్రచారం చేస్తున్నారు. ప్రపంచ రేడియోగ్రఫీ దినం సందర్భంగా చరేడియోలాజిక్ టెక్నాలజీ, చమెడికల్ఇమేజింగ్ లాంటి హాష్ ట్యాగ్‌లు వాడుతూ సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రచారం చేయడం పరిపాటి అవుతున్నది.

ఎక్స్- కిరణాల ఆవిష్కర్త డబ్ల్యూ. సి. రాంటిజెన్:

1895, 08 నవంబర్‌న విల్‌హెమ్ కాన్రడ్ రాంటిజెన్ కృషి ఫలితంగా ఎక్స్-కిరణాల ఆవిష్కరణ జరగడం, వైద్య రంగంలో రోగ నిర్ధారణ సులభం కావడం అనే సందర్భాన్ని ఆసరాగా తీసుకొని 2004 నుంచి ప్రతి ఏట వరల్డ్ రేడియోగ్రఫీ డే పాటిస్తున్నాం. శస్త్ర చికిత్స చేయకుండానే రేడియేషన్ టెక్నాలజీని ఉపయోగించి రోగి శరీరం లోపల జరుగుతున్న మార్పులను, అవయవాల స్థితులను చూడగలగడంతో వ్యాధి వివరాలను తెలుసుకోవడం తేలికైంది. ఎక్స్-కిరణాలతో ప్రారంభమైన రేడియేషన్ ఆధారిత ఇమేజింగ్ టెక్నాలజీ ద్వారా సిటీ-స్కాన్, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ లాంటి రేడియేషన్ టెక్నిక్స్ అందుబాటులోకి రావడంతో వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతున్నది. క్యాన్సర్ ట్యూమర్స్, ఎముకలు విరగడం, న్యుమోనియా, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లను సులభంగా గుర్తించడం, తగు వైద్యాలను అందించడం నేటి విధానం అయ్యింది.

రేడియోగ్రఫర్లకు కృతజ్ఞతలు తెలిపే సందర్భం:

ఆధునిక వైద్య రంగంలో రేడియేషన్ టెక్నాలజీ ప్రాధాన్యం పెరగడంతో సాధారణ రేడియోగ్రఫీ డిప్లమా కోర్సులతో పాటుగా వైద్య కళాశాలలు రేడియోలజీలో పిజి కోర్సులను సహితం ప్రారంభించడం చూసేతున్నాం. శరీరాన్ని తాకకుండా, దేహం లోపల అవయవాల పని తీరును, వాటిలో వచ్చిన మార్పులను తెలుసుకోవడానికి శరీర భాగాలకు రేడియేషన్‌ను పంపించి ఫలితాలను విశ్లేషిస్తున్నారు. నేటి డిజిటల్-ఏఐ యుగంలో వైద్యరంగం ఎంతో ప్రగతిని సాధించడం, చికిత్సలు సులభం కావడం, ప్రజారోగ్య పరిరక్షణ తేలిక కావడం లాంటివి సుసాధ్యం కావడానికి రేడియోగ్రాఫర్లు నిరంతరం కృషి చేస్తున్నారని గమనించి వారి కృషిని మెచ్చుకోవడం, వారిని ప్రోత్సహించడం లాంటివి ప్రపంచ రేడియోగ్రఫీ దినం రోజున నిర్వహిస్తున్నారు.

చూడలేని వాటిని చూడగలగడం, ముట్టుకోకుండానే వ్యాధి మర్మాన్ని తెలుసుకోవడం, క్షణాల్లో వ్యాధి నిర్ధారణ చేయగలగడం, వైద్యులు సరైన ఔషధాలను సూచించగలగడం లాంటివి రేడియోగ్రాఫర్ల కృషితోనే సాధ్యం అవుతున్నాయని గమనిస్తూ 08 నవంబర్‌న మన సమీప డయగ్నాస్టిక్ సెంటర్స్‌లో సేవలందిస్తున్న రేడియోగ్రాఫర్లను గుర్తించి వారిని సన్మానాలతో ప్రోత్సహిస్తూ, కృతజ్ఞతలు సహితం కెలియజేద్దాం, అనారోగ్యాలను తొలి దశలోనే నిర్ధారించుకొని తరిమేద్దాం.

-డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రూ. లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణ (ఆర్డీఐ) నిధి పథకాన్ని మైలురాయిగా అభివర్ణించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, నవంబర్ 7:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన చారిత్రాత్మక రూ. లక్ష కోట్ల పరిశోధన, అభివృద్ధి ఆవిష్కరణల (ఆర్డీఐ) నిధి పథకాన్ని కేంద్ర సైన్స్, టెక్నాలజీ శాఖ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రశంసించారు, దీనిని భారతదేశ శాస్త్రీయ ప్రయాణంలో ఒక మార్పుదాయక మైలురాయిగా ఆయన అభివర్ణించారు.

న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన మొట్టమొదటి ఎమర్జింగ్ సైన్స్, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ కాన్‌క్లేవ్ (ఈఎస్టీఐసీ) 2025 లో ముగింపు ప్రసంగం చేస్తూ, ఈ మూడు రోజుల సమావేశం విజయవంతం కావడం గర్వకారణమని, దీని ద్వారా మంచి ఫలితాలు రాగలవని డాక్టర్ సితేంద్ర సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం "భారత మండపాన్ని నిజమైన ఆవిష్కరణల దేవాలయంగా మార్చింది. ఇక్కడ ఆలోచనలు స్ఫూర్తిని పొందాయి. పరిశోధన ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఆవిష్కరణకు సంకల్పం తోడైంది'' అని కేంద్ర మంత్రి అన్నారు.

'మిషన్ 2047' లో నిర్దేశించిన విధంగా శాస్త్రీయ ప్రతిభ, సాంకేతిక సృష్టి, ఆవిష్కరణల ఆధారిత వృద్ధికి ప్రపంచ కేంద్రంగా ఆవిర్భవించే దిశగా భారత్ ప్రయాణం సాగుతోందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు.

"ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తీరిక లేని కార్యక్రమాలు ఉన్నప్పటికీ ఈ సమావేశానికి పూర్తి గంట సమయాన్ని కేటాయించడం సైన్స్, ఆవిష్కరణలకు ప్రభుత్వం ఇస్తున్న అత్యధిక ప్రాధాన్యతను తెలియచేస్తోంది. జీవ పోషకాలు అధికంగా ఉన్న పంటలు, పోషకాహార భద్రత మొదలుకొని వ్యక్తిగత వైద్యం, స్వచ్ఛ ఇంధనం, జీవ ఎరువుల వరకు అన్ని కీలక రంగాలను గురించి ప్రధాన మంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు" అని డాక్టర్ సితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

ఆధునిక పరిశోధన, ఆవిష్కరణల రంగాలలో జాతీయ ప్రాధాన్యతలను సమన్వయం చేయడానికి 13 మంత్రిత్వ శాఖలను, విభాగాలను ఒకచోట చేర్చిన ఈ సదస్సును అర్ధవంతంగా రూపొందించి, నిర్వహించినందుకు గాను ముఖ్య శాస్త్రీయ సలహాదారు కార్యాలయాన్ని మంత్రి అభినందించారు. నోబెల్ బహుమతి గ్రహీత సర్ ఆండ్రే గైమ్‌తో పాటు పలువురు ప్రసిద్ధ శాస్త్రవేత్తలు, మేధావులు, పారిశ్రామిక రంగ ప్రముఖులు కూడా సమావేశంలో పాల్గొనడాన్ని ఆయన ప్రశంసించారు. 11 ప్రధాన అంశాలపై జరిపిన వారి చర్చలు వచ్చే దశాబ్దానికి వ్యూహాత్మక మార్గదర్శక ప్రణాళికను రూపొందిస్తాయని అన్నారు.

సదస్సులో యువ పరిశోధకులు, డీప్-టెక్ స్టార్టప్‌ల భాగస్వామ్యాన్ని ప్రస్తావిస్తూ, వారి శక్తి, తెలివితేటలు, నిబద్ధత 'నవ భారత' ఆవిష్కరణల స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని డాక్టర్ సింగ్ అన్నారు. భాగస్వామ్యాలు, పెట్టుబడులను కోరుకునే యువ ఆవిష్కర్తలకు పోస్టర్, స్టార్టప్ సెషన్లు విలువైన నెట్వర్కింగ్ వేదికగా పనిచేశాయని ఆయన పేర్కొన్నారు.

"సదస్సులో పాల్గొన్న మన యువ భాగస్వాములలో చాలా మంది విద్యాపరమైన ప్రదర్శనల ప్రపంచంలోకి కొత్తగా ప్రవేశించినవారు. వారి పరిశోధనలను సమర్థవంతంగా వ్యక్తపరిచేలా మార్గనిర్దేశనం చేయాలి. వారు , భవిష్యత్తులో సైన్స్ రంగ నాయకులుగా ఎదిగేలా ప్రోత్సహించాలి" అని ఆయన అన్నారు.

పోస్టర్ ప్రెజెంటర్లకు వారి ప్రదర్శన నాణ్యతను మెరుగుపరచడం, అభ్యాస ఫలితాలను పెంచడం కోసం వర్చువల్ వర్క్‌షాప్‌లను నిర్వహించాలని కేంద్ర మంత్రి ప్రతిపాదించారు. భవిష్యత్తులో జరిగే ఈఎస్టీఐసీ సదస్సుల్లో స్టార్టప్‌ల, పెట్టుబడిదార్ల మధ్య నిర్మాణాత్మక సమావేశాలను నిర్వహించాలని కూడా ఆయన సూచించారు. నూతన ఆవిష్కర్తలను ఆశాజనక భాగస్వాములతో అనుసంధానం చేయాలని అన్నారు.

"ఇటువంటి కార్యక్రమాలకు హాజరయ్యే పెట్టుబడిదారులు కేవలం చూడటానికి మాత్రమే రారు. వారు స్పష్టమైన భాగస్వామ్యాల కోసం చూస్తారు. స్టార్టప్‌ల వివరాలను సరైన పెట్టుబడిదారులతో మనం ముందుగానే మిళితం చేయగలిగితే, ఫలవంతమైన భాగస్వామ్యాలను సులభతరం చేయగలం" అని ఆయన పేర్కొన్నారు. .

భవిష్యత్తులో జరిగే సమావేశాల్లో ప్రధాన చర్చలను సంక్షిప్తంగా, సమర్థవంతంగా నివేదించడానికి ఒకే రిపోర్టర్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఇది ప్లీనరీ సెషన్లలో సమయాన్ని ఆదా చేస్తుందని . మంత్రి సూచించారు.

మంత్రిత్వ శాఖలు, విద్యాసంస్థలు, పరిశ్రమలను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపాదించిన "ఏకోన్ముఖ ప్రభుత్వం, ఏకోన్ముఖ దేశం" విధానానికి ఈ సదస్సు ఉదాహరణగా నిలిచిందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ చర్చలు విద్యాసంస్థలు, పరిశ్రమ, ప్రభుత్వాల మధ్య సమన్వయానికి సంస్థాగత వెన్నెముక వంటి అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఏఎన్ఆర్ఎఫ్) దీర్ఘకాల లక్ష్యాలకు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

అలాగే, ఈఎస్టీఐసీ 2025 తో పాటు నిర్వహించిన వైభవ్ ఫెలోషిప్ సెషన్‌లను కూడా కేంద్రమంత్రి ప్రశంసించారు, మాతృ దేశానికి సేవలందించాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ శాస్త్రవేత్తలలో ఉన్న ఆకాంక్షను ఇవి ప్రతిబింబించాయని అన్నారు. వైభవ్ ఫెలోస్ ఉత్సాహం కేవలం విద్యారంగ సహకారం పైనే కాకుండా, దేశం పట్ల భావోద్వేగ, మేధోపరమైన నిబద్ధతను ప్రతిబింబించింది. వారిని మరింతగా ఆకర్షించే నిర్మాణాత్మక మార్గాలను మనం కనుగొనాలి" అని ఆయన అన్నారు.

ఈఎస్టీఐసీ 2025 భారత సైన్స్ రంగం అభివృద్ధిలో ఒక కొత్త అధ్యాయాన్ని సూచిస్తుందని, ఈ సమావేశం ద్వారా ఉత్పన్నమైన ఆలోచనలు, భాగస్వామ్యాలు "వికసిత భారత్ 2047" లక్ష్యానికి అనుగుణమైన ఆచరణాత్మక విధానాలు, కార్యక్రమాలుగా రూపుదిద్దుకుంటాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

"మా లక్ష్యం స్పష్టంగా ఉంది. అది భారతదేశాన్ని సైన్స్, ఆవిష్కరణ, సాంకేతికతలో ప్రపంచ శక్తిగా మార్చడం. మీ ఆలోచనలు, మీ సహకారాలు మీ ప్రయోగాలు స్వావలంబన సాధనకు సిద్ధంగా ఉన్న దేశానికి దోహదపడే అంశాలు" అని డాక్టర్ జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. ఈఎస్టీఐసీ 2025 ను ఘనంగా విజయవంతం చేసినందుకు అన్ని మంత్రిత్వ శాఖలకు, శాస్త్రీయ సంస్థలకు, పరిశ్రమలకు ఆయన అభినందనలు తెలియచేశారు.




## ఉల్లి రైతుల ముఖాల్లో చిరునవ్వులు



కర్నూలు నవంబర్ 7:ఉల్లిపాయ రైతుల జీవితం అనేది ఎప్పుడూ ఒక పంటతోనే కాదు, ఒక సీజన్‌తో కూడా నిర్ణయించబడదు. ప్రతి ఏటా విత్తనం వేసే క్షణం నుంచే రైతు గుండె కొట్టుకునేది ఈసారి పంట ఎలా వస్తుంది ధర పడిపోతుందా మార్కెట్లో ఎవరు కొనుగోలు చేస్తారా అనే ఆందోళనలతోనే. ఈ ఆందోళనలకు గడిచిన కొన్ని నెలలుగా ఉల్లి రైతులు సాక్ష్యాలుగా నిలిచారు. ఉల్లి ధరలు పడిపోవడంతో కర్నూలు, కడప, అనంతపురం రైతులు నష్టాల తాకిడిలో విలవిల లాడారు.

అయితే ఈసారి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం వారికి కొత్త ఊపిరి పోసింది. ఉల్లి రైతులు నష్టపోకూడదనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ముందడుగు వేశారు. కేవలం మార్కెట్ జోక్యం ద్వారా ఉల్లిని కొనుగోలు చేయడం మాత్రమే రైతులను ఆదుకోలేదని గుర్తించిన ఆయన, హెక్టార్‌కు రూ.50,000 నష్టపరిహారం ప్రకటించారు. ఈ నిర్ణయం విన్నపుడు చాలా మంది రైతుల కన్నీళ్లు కూడా కృతజ్ఞతల కన్నీళ్లుగా మారాయి. ఎందుకంటే పంట పాడైన బాధను అర్థం చేసుకుని, రైతు కష్టం వృథా కాకుండా చూడాలన్న ధృఢనిశ్చయం ఈ నిర్ణయంలో ప్రతిఫలించింది.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ( వివరించిన విధంగా, కర్నూలు మార్కెట్‌లో ప్రభుత్వమే రూ.18 కోట్ల విలువైన ఉల్లిని సేకరించింది. ఇందులో రూ.10 కోట్లను ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ కాగా, మిగతా మొత్తం కూడా త్వరలో అందజేయనుంది. అయితే, ఇది మొదటి అడుగు మాత్రమే. కేవలం మార్కెట్ జోక్యం సరిపోదు, అని గ్రహించిన ముఖ్యమంత్రి, ఆర్థిక భారాన్ని భరించేందుకు ప్రతి హెక్టార్‌కు రూ.50 వేలు అందించే నిర్ణయం తీసుకోవడం.. రైతు మనసులో నమ్మకాన్ని తిరిగి నింపింది.

ఈ నిర్ణయం ప్రభావం కర్నూలు జిల్లాలోనే కాకుండా మొత్తం రాయలసీమలో వినిపిస్తోంది. కర్నూలులో 15,232 హెక్టార్లలో 23,316 మంది రైతులకు రూ.76.16 కోట్లు, కడప జిల్లాలో 5,681 హెక్టార్లలో 6,400 మంది రైతులకు రూ.28.41 కోట్లు ? మొత్తంగా 20,913 హెక్టార్లలో 29,716 మంది రైతులకు రాజు రూ.104.57 కోట్లు ప్రభుత్వం ఇవ్వబోతోంది. ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు, ఇది ఒక ప్రతిజ్ఞా రాయల్ రైతు పక్కనే ప్రభుత్వం నిలబడుతుందనే నమ్మకం.

వాతావరణ మార్పులు, అనుకోని మార్కెట్ పరిస్థితులు, ఎగుమతి-దిగుమతుల ప్రభావం ఇవన్నీ రైతు జీవనానికి ప్రతిబంధకాలే. కానీ ఈసారి ప్రభుత్వం వాటికి ముందుగానే సమాధానం ఇచ్చినట్లు కనిపిస్తోంది. రైతులు నష్టపోకుండా ఉండేందుకు జిల్లా వారీగా పంట స్థితిని మానిటర్ చేసే ప్రత్యేక ప్రక్రియ మొదలుపెట్టడం వ్యవస్థాత్మక ఆలోచనకు నిదర్శనం.రైతుల ప్రయోజనాలు తమ ప్రభుత్వానికి కేంద్రబిందువని ముఖ్యమంత్రి మరోసారి నిరూపించారు. మీ సమస్యలు మా సమస్యలే, ప్రభుత్వం మీ వెంటే ఉంది అనే పదాలు మంత్రి అచ్చెన్నాయుడు మాటలు కేవలం ధైర్యపూరిత వ్యాఖ్యలు కాదు అవి ఒక ప్రభుత్వ తీరును ప్రతిబింబించే సాక్ష్యాలు.

ఉల్లిపాయ రైతుల కన్నీళ్లను ఆరబెట్టడం ఈ నిర్ణయంతో ప్రారంభమైంది. మార్కెట్ ఊచకోతలు, నష్టాల మబ్బులు మధ్యలో రైతులకు ఇప్పుడు ఒక వెలుగు ఆశాకిరణం కనిపిస్తోంది. పంట పాడైనా, మనసు పాడుకాకుండా నిలబెట్టిన ఈ నిర్ణయం, రాబోయే కాలంలో రైతు విధానాలకు మార్గదర్శకంగా నిలవనుంది. ఈ నేపథ్యంలో, ఒక సాదాసీదా పంటే కాదు ఉల్లి ఇప్పుడు ఒక చిహ్నం. రైతు నమ్మకానికి, ప్రభుత్వ బాధ్యతా భావానికి ప్రతీకగా నిలిచింది.

# షట్‌డౌన్ ఎఫెక్ట్‌తో అమెరికా కీలక నిర్ణయం.. విమాన సేవల్లో 10 శాతం కోత

న్యూ డిల్లీ నవంబర్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ నేటితో 38వ రోజుకు చేరుకుంది. దేశ చరిత్రలోనే అత్యధిక కాలం కొనసాగుతున్న షట్‌డౌన్‌గా ఇది చరిత్ర సృష్టించింది. ఈ షట్‌డౌన్‌తో లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఈ షట్‌డౌన్ దేశంలోని పలు విమానాశ్రయాలపై తీవ్ర ప్రభావం పడిన విషయం తెలిసిందే. షట్‌డౌన్ సమయంలో ఎలాంటి జీతం లేకుండా పనిచేస్తున్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, టీఎస్ఏ సిబ్బంది అనారోగ్య కారణాలతో విధులకు గైర్హాజర్ కావడంతో దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలలో విమానాల రాకపోకలు ఆలస్యంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.విమాన సేవల్లో కోత విధించేందుకు సిద్ధమైంది. రద్దీ అత్యధికంగా ఉన్న 40 విమానాశ్రయాల్లో శాతం విమానాలను రద్దు చేయనుంది. ఈ మేరకు ఆ దేశ రవాణా శాఖ మంత్రి సీన్ డఫీ ప్రకటించారు. ఈ మార్పులు శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. పరిమిత సంఖ్యలో ఉన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్‌పై ఒత్తిడి తగ్గించడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. పరిస్థితి మరింత దిగజారితే అదనపు ఆంక్షలు ఉంటాయని మంత్రి వెల్లడించారు. సేనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన ఫెడరల్ నిధులకు చెందిన బిల్లుకు ఆమోదం దక్కకపోవడంతో అక్టోబర్ 1న అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ షట్‌డౌన్ నేటితో 38వ రోజుకు చేరుకుంది. దేశ చరిత్రలోనే అత్యధిక కాలం కొనసాగుతున్న షట్‌డౌన్‌గా ఇది చరిత్ర సృష్టించింది. ఈ షట్‌డౌన్‌తో లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఆహార సహాయంతోపాటు సామాన్య ప్రజల నిత్య జీవితంలోని కీలక అంశాలకు సంబంధించిన కార్యక్రమాలకు ప్రభుత్వ నిధులు కోతపడగా విమాన ప్రయాణాలలో ఆలస్యాలు, జీతం లేకుండా వేలాది మంది ప్రభుత్వ ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తుండడంతో ప్రజల జీవితాలపై ఈ షట్‌డౌన్ తీవ్ర ప్రభావాన్ని చూపిస్తోంది.ఇప్పటికీ ఇది ముగిసే అవకాశాలు కనిపించడం లేదు. ఈ షట్‌డౌన్ కారణంగా అగ్రరాజ్యంలో ఆర్థిక సంక్షోభం తలెత్తింది. అక్టోబర్ 1 నుంచి ఇప్పటి వరకూ దాదాపు 7 బిలియన్ డాలర్లకుపైనే (రూ. 62,195 కోట్లు) నష్టం వాటిల్లింది. షట్‌డౌన్ ఎత్తివేసి పూర్వ పరిస్థితులు ఏర్పడినా అది తిరిగి పొందలేని నష్టమని నిష్పక్షపాతంగా పనిచేసే కాంగ్రెస్ బడ్జెట్ ఆఫీస్ (సీబీఓ) కొత్త నివేదిక తెలిపింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలానికి మరింత నష్టం ఏర్పడుతుందని పేర్కొంది.

# దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు

## -క్వాంటం కంప్యూటర్‌ను వచ్చే జనవరి నుంచే అమలు

## -పౌరులకు సుపరిపాలన అందించడమే లక్ష్యం : సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, నవంబర్ 7 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: డేటా డ్రైవెన్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు నాయుడు ఈరోజు (గురువారం) సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలని అన్నారు. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించామని వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే లక్ష్యం కావాలని సూచించారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామని అధికారులకు తెలిపారు. అంతా కలిసి కట్టుగా పనిచేసి ఇటీవల వచ్చిన తుఫానును టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగామని సీఎం అన్నారు.రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామన్నారు. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందని చెప్పుకొచ్చారు. క్వాంటం కంప్యూటర్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ ద్వారా సమర్థంగా వనరుల్ని వినియోగించగలుగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సీఎం తెలిపారు. 2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరుతున్నామని అన్నారు. నెలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలని సూచించారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతీ నియోజకవర్గానికి ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తామన్నారు. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నామని.. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుందని ముఖ్యమంత్రి వెల్లడించారు.

రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం...

ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం నడుస్తోందని.. సిటిజెన్ డేటా అంతా క్రోడీకరించామని సీఎం తెలిపారు. అంగన్‌వాడీల స్థాయి నుంచే విద్యార్థుల డేటా అనుసంధానం కావాలని అధికారులకు సూచించారు. అవేర్ ద్వారా విస్తృతమైన డేటాను సమన్వయం చేసుకుని వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారం ఒక్క చోటే క్రోడీకరించి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ డేటా ద్వారా రియల్ టైమ్‌లోనే అనలటిక్స్ చేసి వాటి ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉందని చెప్పుకొచ్చారు. ప్రిడిక్టివ్ అనలటిక్స్‌కు కూడా టెక్నాలజీ ద్వారా సాధ్యం అవుతోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం, పాలన కోసం భారీస్థాయిలో బడ్జెట్ వ్యయం చేస్తున్నామని.. నిధులు వ్యయం సమర్థంగా జరగాలని సూచనలు చేశారు.

ఆ పరిస్థితి మారాలి...

ప్రస్తుతం ఇ-ఫైల్స్ కూడా అందరికీ అందుబాటులో ఉన్నాయని.. ఎంత వేగంగా నిర్ణయం తీసుకుంటున్నారన్నదే ప్రశ్న అని అన్నారు. గతంలో ఒక్క చదువుకే కులం, స్థానికత, ఆదాయం ఇలా వేర్వేరు ధృవపత్రాలు 10 రోజులు ఆఫీసుల చుట్టూ తిరిగి తీసుకోవాల్సి వచ్చేదని గుర్తుచేశారు. ఈ పరిస్థితి అంతా మారిపోవాలని... కేంద్రం తీసుకొచ్చిన డీజీ లాకర్‌ను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు. అందరూ అన్ని శాఖలలోని సమాచారాన్ని తెలుసుకుని దానిని గుర్తించి పనిచేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు.

ప్రజలకు చెప్పాల్సిందే...

ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాల వల్ల చాలా ప్రాణాలు పోయాయని అన్నారు. శ్రీకాకుళంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాటి ప్రమాదం జరిగిందని.. ఒక సంఘటన తర్వాత ఆయా తప్పులు దిద్దుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్ఓపీ ఉన్నా దానిని ఎందుకు పాటించలేకపోతున్నాని ప్రశ్నించారు. పీపుల్స్ పాజిటివ్ పర్సెప్షన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గత పాలకుల హయాంలో ఎక్సైజ్‌లో తీవ్రమైన అవకతవకలు జరిగాయని విమర్శించారు. వాటన్నింటినీ సరిచేస్తుంటే మళ్లీ ప్రభుత్వంపైనే బ్లేమ్ గేమ్ వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పారదర్శకత పాటించటంతో పాటు దానిని ప్రజలకు కూడా సరిగ్గా చెప్పుకోవాలని తెలిపారు. పోలీసు విభాగానికి సంబంధించిన వివరాలు కూడా డేటా లేక్‌కు అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రులు, కార్యదర్శులు, హెచ్‌ఓడీలు పాల్గొనగా... జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

# వందేమాతరం దేశభక్తిని, ఐక్యతను చాటుతోంది



అమరావతి, నవంబర్ 7:వందేమాతరం జాతీయ గీతం దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలకు స్ఫూర్తినిచ్చిన ముఖ్యమైన పాట అని జిల్లా ఎస్పి సునీల్ షొరాన్ అన్నారు. ఈ గీతం నేటికీ 150వ వసంతం పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో వందేమాతరం గీతాలాపన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వందేమాతరం గీతం ముఖ్య ఉద్దేశంలో సిబ్బందికి వివరించారు.

దేశభక్తిని, జాతీయ స్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది,నలందా స్కూల్ విద్యార్థులు అంతా ఏకమై వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ ఎం.జావళి, జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్ . యుగంధర్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏఆర్డీఎస్పీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు మోహన్ రెడ్డి, సూర్యమౌళి, జీవన్ బాబు, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు మంజునాథ్, సురేష్ బాబు, ఆర్ఎస్ఐలు, డీపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నవంబరు 8న వారణాసిలో ప్రధాని పర్యటన.. 4 కొత్త వందే భారత్ రైళ్ల ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబర్ 7:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నవంబరు 8న ఉదయం 8:15 గంటలకు వారణాసిని సందర్శించి, నాలుగు కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించనున్నారు. దేశంలో ఆధునిక రైల్వే మౌలిక సదుపాయాల విస్తరణ దిశగా ఇదొక ముఖ్యమైన ముందడుగు.

ప్రపంచ స్థాయి రైల్వే సేవల ద్వారా ప్రజలకు సులభమైన, వేగవంతమైన, మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించాలన్న ప్రధానమంత్రి సంకల్పాన్ని సాకారం చేసే దిశగా ఇది మరో కీలక మైలురాయి. కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు బనారస్-ఖజురహో, లక్నో-సహరాన్‌పూర్, ఫిరోజ్‌పూర్-ఢిల్లీ, ఎర్నాకుళం-బెంగళూరు మార్గాల్లో నడుస్తాయి. ప్రధాన ప్రాంతాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించడం ద్వారా.. ఈ రైళ్లు వివిధ ప్రాంతాల మధ్య రవాణాను మెరుగుపరుస్తాయి. పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు దేశవ్యాప్తంగా ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిస్తాయి.

బనారస్ - ఖజురహో వందే భారత్ రైలు ఈ మార్గాన్ని నేరుగా అనుసంధానించడంతోపాటు ప్రస్తుతం నడుస్తున్న ప్రత్యేక రైళ్లతో పోలిస్తే దాదాపు 2 గంటల 40 నిమిషాల సమయాన్ని ఆదా చేస్తుంది. వారణాసి, ప్రయాగరాజ్, చిత్రకూట్, ఖజురహో సహా దేశంలో అత్యంత పూజనీయమైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదేశాలను బనారస్-ఖజురహో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ అనుసంధానిస్తుంది. ఈ సదుపాయం ద్వారా సాంస్కృతిక పర్యాటకం బలోపేతం కావడంతోపాటు.. యాత్రికులు, ప్రయాణికులకు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రాంతం ఖజురహో వరకు వేగవంతమైన, ఆధునిక, సౌకర్యవంతమైన ప్రయాణం లభిస్తుంది.లక్నో - సహరాన్‌పూర్ వందే భారత్ రైలు ఈ ప్రయాణాన్ని దాదాపు 7 గంటల 45 నిమిషాల్లో పూర్తి చేస్తుంది. దీనివల్ల దాదాపు గంట ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ఇది రూర్కీ మీదుగా పవిత్ర హరిద్వార్ నగరానికి ప్రయాణాన్ని మెరుగుపరచడంతోపాటు.. లక్నో, సీతాపూర్, షాజహాన్‌పూర్, బరేలీ, మొరాదాబాద్, బిజ్నోర్, సహరన్‌పూర్ ప్రయాణికులకు ఎంతగానో ప్రయోజనం చేకూరుస్తుంది. మధ్య, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ వ్యాప్తంగా నగరాల మధ్య ఆధునిక, వేగవంతమైన ప్రయాణాన్ని అందించడం ద్వారా.. రవాణా సదుపాయాలను, ప్రాంతీయాభివృద్ధిని పెంపొందించడంలో ఈ ఎక్స్‌ప్రెస్ కీలక పాత్ర పోషిస్తుంది. ఫిరోజ్‌పూర్ - ఢిల్లీ వందే భారత్ రైలు ఈ మార్గంలో అత్యంత వేగవంతమైన రైలు.ఇది 6 గంటల 40 నిమిషాల్లో ప్రయాణాన్ని పూర్తి చేస్తుంది. దేశ రాజధానికి పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్, భటిండా, పాటియాలా సహా కీలక నగరాల మధ్య అనుసంధానాన్ని ఈ ఎక్స్‌ప్రెస్ బలోపేతం చేస్తుంది. ఈ రైలు వాణిజ్యం, పర్యాటకం, ఉపాధి అవకాశాలను పెంచడమే కాకుండా.. సరిహద్దు ప్రాంతాల సామాజిక - ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని, జాతీయ మార్కెట్లతో ఏకీకరణను మరింతగా ప్రోత్సహిస్తుందని భావిస్తున్నారు.దక్షిణ భారతదేశంలో.. ఎర్నాకుళం - బెంగళూరు వందే భారత్ 8 గంటల 40 నిమిషాల్లోనే ప్రయాణాన్ని పూర్తి చేసి.. ప్రయాణ సమయాన్ని 2 గంటలకు పైగా తగ్గిస్తుంది.

# అద్భుతమైన ఆటతీరుతో ట్రోఫీని గెలిచిన జట్టుకు ప్రధానమంత్రి అభినందనలు

న్యూఢిల్లీ, నవంబర్ 7:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ న్యూఢిల్లీలోని లోకకల్యాణ్ మార్గ్, 7లో ఐసీసీ మహిళా ప్రపంచ కప్ 2025 ఛాంపియన్లతో నిన్న ముచ్చటించారు. 2025 నవంబర్ 2, ఆదివారం జరిగిన తుదిపోరులో దక్షిణాఫ్రికాపై భారత జట్టు విజయం సాధించింది. దేవ దీపావళి, గురు పర్వ్ రెండింటినీ నిర్వహించుకొనే ఈ రోజు చాలా ముఖ్యమైనదంటూ.. ఈ కార్యక్రమానికి హాజరైన వారికి ప్రధానమంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రధానమంత్రికి కృతజ్ఞతలు తెలియజేస్తూ.. ఆయన్ను కలుసుకోవడం గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నానని జట్టు కోచ్ శ్రీ అమోల్ మజుందార్ అన్నారు. దేశ కుమార్తెలు నాయకత్వం వహించిన ఉద్యమంగా క్రీడాకారిణులు చేసిన కృషిని వర్ణిస్తూ.. రెండేళ్లుగా వారు కనబరిచిన అసాధారణ అంకితభావాన్ని ప్రశంసించారు. ప్రతి ప్రాక్టీస్ సెషన్లోనూ అమ్మాయిలు అద్భుతమైన ఉత్సాహంతో, శక్తితో ఆడారని, వారు పడిన కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందన్నారు.

ట్రోఫీ గెలవకపోయినప్పటికీ 2017లో ప్రధానమంత్రితో జరిగిన సమావేశాన్ని కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ గుర్తు చేసుకున్నారు. ఏళ్లుగా తాము కష్టపడి గెలుచుకున్న ట్రోఫీని ఇప్పుడు ఆయనకు అందించడం గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు. తమ ఆనందాన్ని ప్రధానమంత్రి రెట్టింపు చేశారని, ఇది తమకు గర్వకారణమన్నారు. భవిష్యత్తులోనూ ప్రధానితో సమావేశమవడం, గ్రూపు ఫోటోలు తీసుకోవడాన్ని కొనసాగించడమే తమ లక్ష్యమని ఆమె చెప్పారు.

వారు సాధించిన విజయం నిజంగా గొప్పదని శ్రీ మోదీ ప్రశంసించారు. భారత్‌లో క్రికెట్ ఒక ఆటగా మాత్రమే పరిమితం కాలేదని, అది ప్రజల జీవితాల్లో భాగమైందన్నారు. క్రికెట్ బాగా ఆడుతున్నప్పుడు.. దేశం ఉత్సాహంగా ఉంటుందని, చిన్న ఎదురుదెబ్బ తగిలినా దేశమంతా కుంగిపోతుందన్నారు. వరుసగా మూడు మ్యాచుల్లో పరాజయం చవిచూసిన తర్వాత ఈ జట్టు విమర్శలు ఎలా ఎదుర్కోవాల్సి వచ్చిందో వివరించారు.

2017లో ఫైనల్లో ఓడిపోయిన తర్వాత తాము ప్రధానమంత్రిని కలుసుకున్నామని.. తర్వాత లభించే అవకాశంలో ఉత్తమ ప్రదర్శన ఇవ్వాలని ఆ సమయంలో తమను ప్రోత్సహించారని హర్మన్ ప్రీత్ కౌర్ గుర్తు చేసుకున్నారు. ట్రోఫీని గెలుచుకొని మళ్లీ ప్రధానితో మాట్లాడుతున్నందుకు తన సంతోషాన్ని వ్యక్తం చేశారు.

తన ఆలోచనలను పంచుకోవాల్సిందిగా ప్రధానమంత్రి స్మృతి మంధానను ప్రధానమంత్రి ఆహ్వానించారు. 2017లో ట్రోఫీని జట్టు గెలవలేకపోయిందని, కానీ ఆ సమయంలో అంచనాలను ఎలా అధిగమించాలనే ప్రశ్నను ప్రధానిని అడిగినట్లు గుర్తు చేసుకున్నారు. అప్పుడు ఆయనిచ్చిన సమాధానం తనకు గుర్తుండిపోయిందని, తర్వాత ఆరేడేళ్ల పాటు ప్రపంచకప్‌లో అనేక పరాజయాలు మూటకట్టుకున్నప్పటికీ జట్టుకు ఎంతో తోడ్పడిందని తెలిపారు. ప్రపంచ కప్‌ను మొదటిసారి భారత్ గెలుచుకోవడం, దానిని ఇక్కడే నిర్వహించడం విధి నిర్ణయంగా భావిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రధానమంత్రి తనకు ఎల్లప్పుడూ స్ఫూర్తిగా నిలిచారని, ముఖ్యంగా ఇస్రో ప్రయోగాల నుంచి దేశం సాధించిన ఇతర విజయాల వరకు ఇప్పుడు అన్ని రంగాల్లోనూ మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. ఇది స్ఫూర్తిదాయకంగా నిలిచిందని, మరింత మెరుగైన ప్రదర్శన చేసేలా, తోటి అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచే సాధికారత ఇచ్చిందని వివరించారు. దీన్ని దేశం మొత్తం చూసి గర్విస్తోందన్న శ్రీ మోదీ.. వారి అనుభవాలను మనస్ఫూర్తిగా వినాలనుకుంటున్నానని చెప్పారు. ఈ విజయంలో ఎవరి సహకారం తక్కువ కాదని.. ప్రతి క్రీడాకారిణి ఇంటికి వెళ్లి తన కథను పంచుకోగలడమే తనకు నచ్చిన అంశమని స్మృతి మంధాన అన్నారు. అంచనాలకు తగినట్లుగా ఎలా ఉండాలో గతంలో ప్రధానమంత్రి ఇచ్చిన సూచన తనకు గుర్తుందని, ఆయన ప్రశాంతమైన, గంభీరమైన ప్రవర్తన కూడా స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు.

జట్టు ప్రయాణాన్ని జెమిమా రోడ్రిగ్స్ వివరించారు. తాము వరుసగా మూడు మ్యాచులు ఓడిపోయామని, ఎన్నిసార్లు ఓటమిని ఎదుర్కొన్నామన్నది జట్టును నిర్వచించదని, పడిన తర్వాత తిరిగి ఎలా పుంజుకున్నామన్నదే తెలియజేస్తుందన్నారు. జట్టు అంతా ఉత్తమ ప్రదర్శన చేసిందని అందుకే తాము విజేతగా నిలిచామని తెలియజేశారు. జట్టులో ఉన్న ఐక్యతే తాను చూసిన ఉత్తమమైన అంశమని వెల్లడించారు. ఏ క్రీడాకారిణి అయినా ఉత్తమ ప్రదర్శన చేసినప్పుడు.. మిగిలిన వారు తామే పరుగులు చేసినట్లు లేదా వికెట్లు తీసినట్లు సంబరపడ్డారని తెలిపారు. ఎవరి ప్రదర్శనైనా బాగా లేకపోతే.. భుజంపై చేయి వేసి "మరేం ఫర్వాలేదు. తర్వాతి మ్యాచులో నువ్వు దాన్ని సాధిస్తావు" అనే సభ్యురాలు ఉన్నారని తెలిపారు. ఈ తోడ్పాటు, బృందస్ఫూర్తే తమ జట్టును నిర్వచిస్తుందన్నారు.

జెమిమా రోడ్రిగ్స్ అభిప్రాయంతో స్నేహ్ రాణా ఏకీభవించారు. విజయం సాధించిన క్షణాల్లో అందరూ కలిసి ఎలా ఉన్నామో.. ఓడిపోయిన సందర్భంలోనూ ఒకరికొకరు మద్దతు ఇచ్చుకోవడం అవసరమన్నారు. ఒక జట్టుగా, ఒక యూనిట్‌గా ఏం జరిగినా ఒకరి చేయి ఒకరు విడవకూడదని, ఒకరికొకరు చేయూత అందించుకోవాలని తాము నిర్ణయించుకున్నామని తెలిపారు. ఇదే తమ జట్టులోని అత్యుత్తమ లక్షణమన్నారు.

అందరూ నవ్వుతూ ఉండేలా హర్మన్‌ప్రీత్ కౌర్ తమను ప్రోత్సహించారని క్రాంతి గౌడ్ తెలిపారు. ఎవరైనా కాస్త అధైర్యంగా ఉన్నప్పటికీ.. ఒకరినొకరు నవ్వుతూ చూడటం వల్ల జట్టులోని ప్రతి సభ్యురాలు ఉత్సాహంగా, విశ్వాసంగా ఉండేలా చేయడమే జట్టు విధానమన్నారు. బృందంలో ఎవరైనా అందరినీ నవ్విస్తూ ఉంటారా అని ప్రధాని ప్రశ్నించారు. జెమిమా రోడ్రిగ్స్ ఆ పని చేస్తారంటూ క్రాంతి బదులిచ్చారు. జట్టును సమష్టిగా ఉంచడంలో హర్లీన్ కౌర్ డియోల్ ముఖ్యమైన పాత్ర పోషించారని జెమిమా వెల్లడించారు.

ప్రతి జట్టులోనూ వాతావరణాన్ని తేలిక పరిచే వ్యక్తి ఉండాలని తాను భావిస్తానని హర్లీన్ కౌర్ డియోల్ తెలిపారు. ఎవరైనా ఒంటరిగా ఉన్నట్లు చూసినా లేదా తనకు ఖాళీ సమయం దొరికినా.. ఇతరులతో ముచ్చటించేందుకు తాను ప్రయత్నిస్తానన్నారు. తన చుట్టూ ఉన్న వారు ఆనందంగా ఉంటే తాను కూడా ఉత్సాహంగా ఉంటానని చెప్పారు.

తిరిగి వచ్చినప్పటి నుంచి జట్టు ఏమైనా చేసిందా అని ప్రధానమంత్రి అడిగారు. తాను చాలా గట్టిగా మాట్లాడుతున్నానని, మౌనంగా ఉండమని ఇతరులు చెప్పారని హర్లీన్ కౌర్ సరదాగా చెప్పారు. ప్రధానమంత్రి మెరిసిపోతున్నారంటూ.. రోజూ ఆయన అనుసరించే స్కిన్ కేర్ రొటీన్ గురించి చెప్పమని ఆమె అడిగారు. ఆ విషయం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని ప్రధానమంత్రి సమాధానమిచ్చారు. కోట్లాది మంది భారతీయుల ప్రేమ ఆయనను మెరిసేలా చేస్తోందంటూ ఓ క్రీడాకారిణి చమత్కరించారు. దానికి ప్రధాన మంత్రి ఏకీభవిస్తూ, సమాజం చూపించే ఆత్మీయతే గొప్ప బలాన్ని ఇస్తుందన్నారు. తాను ప్రభుత్వాధినేతగా ఉండటంతో సహా ప్రభుత్వంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్నానని, ఇంత సుదీర్ఘ కాలం అనంతరం తనకు ఇలాంటి ఆశీర్వాదాలు రావడం మంచి ప్రభావాన్ని చూపిస్తుందన్నారు.

జట్టులో అడిగే వివిధ ప్రశ్నలు, భిన్నమైన వ్యక్తిత్వాల గురించి కోచ్ వ్యాఖ్యానించారు. రెండేళ్లుగా జట్టుకు ప్రధాన కోచ్‌గా ఉంటున్నానని ఆయన తెలిపారు. జూన్‌లో ఇంగ్లాండ్‌లో కింగ్ ఛార్లెస్‌ను కలిసినప్పుడు తమకు ఎదురైన అనుభవం గురించి ఆయన వివరించారు. ప్రోటోకాల్ నిబంధనల కారణంగా కేవలం 20 మందికి మాత్రమే అనుమతించారని, దానివల్ల సహాయ సిబ్బంది హాజరు కాలేకపోయారని తెలిపారు.

అందరు క్రీడాకారులు, నిపుణులైన ముగ్గురు కోచ్‌లు హాజరయ్యారు. ప్రోటోకాల్ ప్రకారం 20 మందిని మాత్రమే అనుమతించటం వల్ల సహాయక సిబ్బంది హాజరుకాలేపోవటం బాధగా ఉందని కోచ్ అన్నారు. దీనిపై స్పందించిన సహాయక సిబ్బంది.. ఆ ఫోటోతో తమకు అవసరం లేదని, నవంబర్ 4, 5 తేదీల్లో ప్రధానమంత్రి మోదీతో ఒక ఫోటో దిగాలని ఉందని చెప్పినట్లు కోచ్ వివరించారు. ఈ రోజు వారి కోరిక నెరవేరిందన్నారు.

తమకు మాత్రమే ఎదురుదెబ్బలు తగులుతున్నాయని భావించిన క్షణాలున్నాయని, కానీ ఆ కష్టాలు తమని మానసికంగా, శారీరకంగా దృఢంగా మార్చాయని హర్మన్ ప్రీత్ కౌర్ తెలిపారు. ఈ విషయాన్ని పంచుకున్నప్పుడు ఎలాంటి భావోద్వేగానికి గురయ్యారని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హర్మన్ ప్రీత్ ను అడిగిన సమయంలో, ఇది చాలా స్ఫూర్తిదాయకమని గుర్తించినట్లు చెప్పారు. ప్రధానమంత్రి ప్రశ్నకు ఆ క్రీడాకారిణి స్పందిస్తూ, ఏదో ఒకరోజు తాము తప్పకుండా ట్రోఫీని గెలుస్తామనే నమ్మకం ఉండేదని, మొదటినుంచి జట్టు సభ్యుల్లో ప్రత్యేక అనుభూతి ఉందని తెలిపారు. వారు ఎదుర్కొన్న సవాళ్లను, ప్రతికూల పరిస్థితుల్లో ప్రదర్శించిన ధైర్యం, ఇతరుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిన తీరుని ప్రధానమంత్రి ప్రశంసించారు. తన ఆత్మ విశ్వాసాన్ని, ప్రతీ టోర్నమెంట్‌లో జట్టు సభ్యుల ఆటతీరు మెరుగవటాన్ని ప్రధానంగా ప్రస్తావించిన హర్మన్ ప్రీత్.. జట్టు సభ్యులందరికీ ఘనతను పంచారు. గతంలో జరిగిన వాటిని మార్చలేమని, వాటిని అంగీకరిస్తూ మానసికంగా దృఢంగా మారేందుకు రెండేళ్లుగా తాము కృషి చేసినట్లు వెల్లడించారు. దీనికి స్పందించిన ప్రధానమంత్రి.. ఈ ప్రయాణం వారికి వర్తమానంలో జీవించటం నేర్పిందన్నారు. ఈ కారణంగానే తన జట్టు సభ్యులను ప్రోత్సహించేందుకు అదనంగా ఏమి చేస్తారోనని ప్రధానమంత్రిని అడిగినట్లు చెప్పారు. తమ విశ్వాసాన్ని బలపరచుకోవటానికి ప్రధానమంత్రి, తమ కోచ్‌ల మార్గదర్శకాలు సరైన మార్గంలో నడిపించాయని ఆమె స్పష్టం చేశారు.

ప్రధాన మంత్రి దీప్తి శర్మతో మాట్లాడుతూ, పగటిపూట ఆమె పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ (డీఎస్పీ) పాత్ర గురించి అడిగారు. ఆమె అన్నింటినీ నియంత్రిస్తుండాలంటూ ప్రధానమంత్రి చమత్కరించారు. దీనికి ఆమె బదులిస్తూ, తాము కేవలం ఆ క్షణాలని ఆస్వాదిస్తూ, ఆయన్ని కలిసే సమయం కోసం వేచి చూశామని చెప్పారు. వైఫల్యం నుంచి నేర్చుకుని, ముందుకు సాగటం తెలుసుకున్న వారే నిజమైన క్రీడాకారులని 2017లో ప్రధానమంత్రి చెప్పిన విషయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. మోదీ మాటలు ఎల్లప్పుడూ స్ఫూర్తిని కలిగించాయని, క్రమం తప్పకుండా ఆయన ప్రసంగాలు వింటానని తెలిపారు. ఎన్నో సవాళ్లున్నప్పటికీ ఆయన.. శాంతంగా, నిలకడగా పరిస్థితులు ఎదుర్కొనే విధానం ఆటలోనూ, వ్యక్తిగతంగా ఎంతగానో సహకరిస్తుందని స్పష్టం చేశారు.

దీప్తి శర్మ చేతిపై ఉన్న హనుమాన్ టాటూ గురించి, అది ఆమెకు ఎలా సహాయపడుతుందని శ్రీ మోదీ అడిగారు. దానికి ఆమె బదులిస్తూ.. తన మీద కంటే, హనుమాన్ జీ పైనే నమ్మకం ఎక్కువని, ఆయన పేరు తలచుకుంటే కష్టాలను అధిగమించే బలం వస్తుందని చెప్పారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలోనూ "జై శ్రీరామ్" అని రాస్తారని ప్రధానమంత్రి ప్రస్తావించగా, అవునని తెలిపారు. జీవితంలో విశ్వాసమనేది కీలక పాత్ర పోషిస్తుందని ఉన్నతమైన శక్తికి మనల్ని అప్పగించుకునే ధైర్యాన్నిస్తుందని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. మైదానంలో ఆమె చూపే ఆత్మవిశ్వాసం, ఆధిపత్య ధోరణి గురించి ప్రశ్నించారు. ఆధిపత్యం కాదు కానీ, తను బంతి విసిరే వేగం విషయంలో భయం ఉందనేది మాత్రం నిజమని, అందుకే 'కొంచెం నెమ్మదిగా వేయమ్మా' అంటూ తోటి క్రీడాకారులు సరదాగా అంటారని ఆమె తెలిపారు. తన టాటూ, ఇన్‌స్టాగ్రామ్ ట్యాగ్ లైన్ గురించి ప్రధానమంత్రి వ్యక్తిగతంగా అడగటం పట్ల దీప్తి సంతోషం వ్యక్తం చేశారు.

టోర్నీ విజయం తర్వాత హర్మన్ ప్రీత్ జేబులో బంతి దాచుకోవటం గురించి ప్రధానమంత్రి అడిగారు. అది ప్రణాళికలో భాగమా లేదా ఎవరైనా మార్గనిర్దేశం చేశారా అని ప్రశ్నించారు. అందుకు హర్మన్ ప్రీత్ బదులిస్తూ.. అది ఒక దైవ నిర్ణయం, చివరి బాల్, క్యాచ్ తన వద్దకు వస్తాయని అసలు ఊహించలేదని.. అయితే బాల్ తన వద్దకు వచ్చినప్పుడు, అది ఏళ్ల నాటి కృషి, నిరీక్షణల ఫలితమనిపించిందని, అందుకే దాన్ని దాచుకోవాలనుకున్నట్లు వివరించారు. ఇప్పటికీ ఆ బంతి తన బ్యాగులో ఉందని చెప్పారు.

రెజ్లర్లకు ప్రసిద్ధి పొందిన ప్రాంతం రోహ్‌తక్ నుంచి వచ్చిన షెఫాలీ వర్మతో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. క్రికెట్ వైపు ఎలా వచ్చారని అడిగారు. రెజ్లింగ్, కబడ్డీ రోహ్‌తక్‌లో ప్రధాన క్రీడలైనప్పటికీ, క్రికెట్ ప్రయాణంలో తన తండ్రి కీలక పాత్ర పోషించారని షెఫాలీ బదులిచ్చారు. సాంప్రదాయ అఖాడా క్రీడలు ఆడారా అని ప్రధానమంత్రి ప్రశ్నించగా, ఆడలేదని ఆమె చెప్పారు. క్రికెటర్ కావాలని తన తండ్రి ఆశించినా, ఆ కలను నెరవేర్చుకోలేకపోయారని, ఆయన కోరిక పిల్లల ఆశయంగా మారిందని చెప్పారు. షెఫాలీ, తన సోదరుడు కలిసి మ్యాచ్‌లు చూసేవారని, అలా క్రికెట్‌పై ఆసక్తి పెరిగి, క్రికెటర్‌గా మారినట్లు తెలిపారు.

క్యాచ్ పట్టటానికి ముందు హర్మన్ ప్రీత్ నవ్వటాన్ని తాను చూశానని, దానికి గల కారణమేంటని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అడిగారు. దానికి ఆమె బదులిస్తూ.. ఆ బంతి తన వద్దకే రావాలని మానసికంగా సంకల్పించుకున్నట్లు, బాల్ తన వద్దకి వచ్చినప్పుడు తెలియకుండానే నవ్వు ఆపుకోలేకపోయినట్లు చెప్పారు. ఆ బంతి మరెక్కడికీ వెళ్లదని ఆమె చాలా నమ్మకంగా ఉన్నట్లనిపించిందని ప్రధానమంత్రి అన్నారు. ఒకవేళ బంతి వేరే చోటుకి వెళ్లినా, ఎలాగైనా పట్టుకునేదాన్ని అని హర్మన్ ప్రీత్ తెలిపారు.

జెమిమా రోడ్రిగ్స్ భావోద్వేగాన్ని వివరించమని అడిగినప్పుడు.. తమ జట్టు తరచుగా ఆస్ట్రేలియా చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయేదన్నారు. సెమీ-ఫైనల్స్ మ్యాచ్ గెలవటం, చివరి వరకు ఆడటమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఆటను మలుపు తిప్పటానికి మంచి భాగస్వామ్యం అవసరమని, టీమ్ సభ్యులందరూ అదే నమ్మకంతో ఒక్కటిగా కృషి చేసినట్లు తెలిపారు. తాను సెంచరీ కొట్టినా, ఈ గెలుపునకు హర్మన్ ప్రీత్ కౌర్, దీప్తి, రిచా, అమన్ జోత్ సహకారం ప్రధాన కారణమన్నారు. వారి అత్యుత్తమ ఇన్నింగ్స్ వల్లనే ఈ విజయం సాధ్యమైందని చెప్పారు. గెలవగలమని అందరూ నమ్మారు - గెలిచామని ఆమె స్పష్టం చేశారు.

ప్రపంచ కప్ గెలిచిన అనుభవం ఎలా ఉంది? మూడు మ్యాచ్‌లు ఓడిపోయిన తర్వాత ఎలా అనిపించింది? తిరిగి ఎలా పుంజుకున్నారనే విషయాలు తెలుసుకునేందుకు ప్రధానమంత్రి ఆసక్తి చూపారని జెమిమా తెలిపారు.

ప్రపంచ కప్ గెలవటం తనకు వ్యక్తిగతంగానే కాక, తన గ్రామంలోని ప్రజలకు కూడా ఎంతో గర్వకారణమని క్రాంతి గౌడ్ తెలిపారు. బౌలింగ్ చేసినప్పుడల్లా, మొదటి వికెట్ తీసేది క్రాంతి అని హర్మన్ ప్రీత్ చెప్పేదని, అలా అన్నప్పుడు తాను మెరుగైన బౌలింగ్ చేసేందుకు మరింత ఉత్సాహంగా ఉండేదని తెలిపారు. క్రాంతి పెద్దన్నయ్యకు క్రికెట్‌పై ఉన్న ప్రేమ, ప్రధానమంత్రిపై ఉన్న అభిమానం గురించి మాట్లాడారు. వాళ్ల నాన్న ఉద్యోగం కోల్పోవటం వల్ల, తన అన్నయ్య అకాడమీలో చేరలేకపోయాడని, అనధికారికంగా ఆటను మాత్రం కొనసాగించినట్లు చెప్పారు. అన్నయ్య నుంచి ప్రేరణ పొందిన క్రాంతి.. టెన్నిస్ బాల్స్‌తో అబ్బాయిలతో ఆడటం ప్రారంభించినట్లు తెలిపారు. అధికారికంగా ఆమె క్రికెట్ ప్రయాణం ఒక స్థానిక లెదర్ బాల్ టోర్నమెంట్-ది ఎమ్మెల్యే ట్రోఫీతో ప్రారంభమైనట్లు వెల్లడించారు. అందులో ఓ క్రీడాకారిణికి అనారోగ్యం కారణంగా ఆమె స్థానంలో ఆడమని క్రాంతిని అడిగినట్లు చెప్పారు. ఆమెకి పొడవైన జుట్టు ఉన్నప్పటికీ, ఆడేందుకు ఆహ్వానం లభించిందన్నారు. తన మొదటి మ్యాచ్‌లోనే రెండు వికెట్లు తీసి, 25 పరుగులు చేసి, 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి ఆమె క్రికెట్ కెరీర్ మొదలైందన్నారు.

షెఫాలీ వర్మకు చివరి రెండు ఆటల్లో పాలుపంచుకునే అవకాశం దక్కిందని ప్రధానమంత్రి శ్రీ మోదీ అన్నారు. అవునని షెఫాలీ చెప్తూ, తనకు పిలుపు వచ్చే ముందు దేశవాళీ క్రికెట్ ఆడానన్నారు. ప్రతీక విషయంలో జరిగిన ఘటన దురదృష్టకరమైందనీ, మరే క్రీడాకారిణి విషయంలోనూ ఇలా జరగకూడదనే అంతా కోరుకుంటారనీ షెఫాలీ అన్నారు. ఏమైనా, తనను పిలిచినప్పుడు, తాను ఆత్మవిశ్వాసాన్ని చాటడంతో జట్టు సభ్యులంతా తనను నమ్మారని ఆమె అన్నారు. తనతో ఏ అవసరం పడినా జట్టు గెలుపునకు సాయపడాలనే తాను సంకల్పించుకున్నట్లు ఆమె చెప్పారు.

ప్రతీకా రావల్ మాట్లాడుతూ, తాను గాయపడిన తరువాత జట్టు సభ్యుల్లో అనేక మంది ప్రతీక కోసం ప్రపంచ కప్ గెలవాలని ఉందని తమ మనోభీష్టాన్ని వెల్లడించారన్నారు. తాను అధికారికంగా జట్టులో లేననీ, 16వ క్రీడాకారిణిననీ అయినప్పటికీ చక్రాల కుర్చీలో తనను స్టేజీ పైకి రప్పించి తన పట్ల పూర్తి గౌరవాదరణలను వ్యక్తం చేశారనీ ప్రతీక తెలిపారు. జట్టు ఒక కుటుంబమని, జట్టులో ప్రతి క్రీడాకారిణినీ సమానంగా చూశారని, అలా అందరూ కలిసికట్టుగా ఆడారంటే వారిని ఓడించడం చాలా కష్టమని ఆమె చెప్పారు. ఫైనల్లో గెలుపునకు జట్టు పూర్తిగా అర్హమైందేనని ఆమె స్పష్టం చేశారు. ఈ మాటలతో ప్రధానమంత్రి ఏకీభవిస్తూ, జట్టు భావన కీలకం.. ఒక్క ఆట మైదానంలోనే కాదు, ఆట మైదానం బయట కూడానని స్పష్టం చేశారు. కలిసి ఉంటే బంధం బలపడుతుందని, అందరి బలాలూ బలహీనతలూ తెలియడం వల్ల లోటుపాట్లను భర్తీ చేసుకుంటూ ఒకరికి మరొకరు అండదండలను అందించుకోవచ్చని ఆయన అన్నారు.

ఒక క్యాచ్ చాలా ప్రసిద్ధిని పొందిందని శ్రీ మోదీ అన్నారు. అమన్‌జోత్ కౌర్ మాట్లాడుతూ, ఇంతకు ముందు వరకూ అనేక సార్లు తాను చక్కటి క్యాచ్‌లను అందుకున్నప్పటికీ, వాటిలో వేటికీ ఇంతటి పేరు ప్రఖ్యాతులు దక్కలేదనీ, తాను మొదట తడబడ్డా చివరకు బంతిని చేజిక్కించుకున్నందుకు సంతోషం కలిగిందనీ తెలిపారు. ఆ క్యాచే కీలకమైన మలుపుగా మారింది అని ప్రధానమంత్రి చెప్తూ, ఆ క్యాచ్ పట్టుకున్న తర్వాత ట్రోఫీ కళ్ల ముందే కదలాడుతున్నట్లు తోచి ఉండి ఉండవచ్చు కదూ అన్నారు. అమన్‌జోత్ జవాబిస్తూ, నిజానికి ఆ క్యాచ్ తీసుకున్నాక ట్రోఫీనే అందుకున్నట్టుగా తనకు అనిపించిందనీ, ఆ సంబరంలో చాలా మంది తనను చుట్టుముట్టి హత్తుకోవడంతో తాను ఉబ్బితబ్బిబ్బు అయిపోయానన్నారు.

ఇదివరకు ఇలాంటి ఓ క్యాచ్‌నే సూర్యకుమార్ యాదవ్ కూడా ఒడిసిపట్టుకున్నారని ప్రధానమంత్రి ప్రస్తావించారు. క్రీడాకారుల్లో ఒకరి క్యాచ్ తనకు భలేగా అనిపించడంతో, ఆ సన్నివేశాన్ని రీట్వీట్ చేసిన సంగతిని ఆయన గుర్తు చేశారు.

ఇంగ్లండ్‌లో జరిగిన ఒక విషయం గురించి హర్లీన్ కౌర్ దేవల్ చెబుతూ, అక్కడ అలాంటి క్యాచుల్ని చాలా కాలం తాము ప్రాక్టీస్ చేసినట్లు ఆమె చెప్పారు. ఫీల్డింగ్‌లో ఒక క్యాచును పట్టుకోలేకపోతే హర్మన్‌ప్రీత్ కౌర్ తనను చీవాట్లు పెట్టారనీ, మంచి ఫీల్డర్లు అలాంటి క్యాచుల్నివదలివేయకూడదని తనతో అన్నారనీ హర్లీన్ తెలిపారు.

# ఏడాది పొడవునా సాగే 'వందే మాతరం' 150 ఏళ్ల సంస్మరణోత్సవాన్ని నవంబరు 7న ప్రారంభించనున్న ప్రధాని

న్యూఢిల్లీ, నవంబర్ 7:ఏడాది పొడవునా నిర్వహించే జాతీయ గేయం 'వందేమాతరం' సంస్మరణ కార్యక్రమాన్ని న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2025 నవంబర్ 7న ఉదయం 9:30 గంటల సమయంలో ప్రారంభిస్తారు.

ఒక స్మారక స్టాంపును, నాణేన్ని కూడా ప్రధానమంత్రి ఈ సందర్భంగా విడుదల చేస్తారు. స్వాతంత్ర్యోద్యమానికి స్ఫూర్తినిచ్చి.. నేటికీ దేశ కీర్తిని, ఐక్యతను పెంపొందిస్తున్న చిరతరమైన ఈ గేయానికి 150 ఏళు నిండిన సందర్భంగా... 2025 నవంబరు 7 నుంచి 2026 నవంబరు 7 వరకు దేశవ్యాప్తంగా ఏడాది పొడవునా నిర్వహించే సంస్మరణోత్సవానికి అధికారిక ప్రారంభంగా ఈ కార్యక్రమం నిలవనుంది.

ఈ ఉత్సవాల్లో భాగంగా, ప్రధాన కార్యక్రమంతోపాటే ఉదయం 9:50 గంటల సమయంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల భాగస్వామ్యంతో.. బహిరంగ ప్రదేశాల్లో 'వందే మాతరం' పూర్తి గేయాన్ని సామూహికంగా ఆలపిస్తారు.

2025తో వందేమాతరం గేయానికి 150 ఏళ్లు పూర్తయ్యాయి. మన జాతీయ గేయం 'వందే మాతరా'న్ని 1875 నవంబరు 7న అక్షయ నవమి శుభ వేళ బంకించంద్ర ఛటర్జీ రచించారు. ఆయన నవల ఆనందమఠ్‌లో భాగంగా బంగదర్శన్ అనే సాహిత్య పత్రికలో వందే మాతరం మొదటిసారి కనిపించింది. బలానికి, శ్రేయస్సుకు, దైవత్వానికి స్వరూపంగా మాతృభూమిని కీర్తించే ఈ గేయం.. దేశ ఐక్యత, ఆత్మగౌరవ స్ఫూర్తికి కవితాత్మక వ్యక్తీకరణ. అనతికాలంలోనే ఇది దేశభక్తికి శాశ్వత చిహ్నంగా నిలిచింది.

# రెండో పెళ్లి సంబంధంపై గొడవ.. కత్తులతో పొడుచుకున్న స్నేహితులు

న్యూఢిల్లీ, నవంబర్ 7:వైవాహిక జీవితంలో విభేదాల వల్ల ఒక వ్యక్తి తన భార్యను పుట్టింట్లో వదిలేశాడు. రెండో పెళ్లి చేసుకోవాలని భావించాడు. మహిళతో పెళ్లి సంబంధం కుదర్చమని స్నేహితుడికి కొంత డబ్బు ఇచ్చాడు. రెండో పెళ్లి కోసం ఇద్దరు ఫ్రెండ్స్ మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కత్తితో పొడుచుకున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో ఈ సంఘటన జరిగింది. పెళ్లైన జగదీష్ చాలా కాలంగా వైవాహిక జీవితంలో విభేదాలు ఎదుర్కొంటున్నాడు. దీంతో భార్యను విడిచిపెట్టి రెండో పెళ్లి చేసుకోవాలని భావించాడు. స్నేహితుడైన 35 ఏళ్ల దీపక్‌కు ఈ విషయం చెప్పాడు. ఒక మహిళతో రెండో పెళ్లి సంబంధం కుదుర్చుతానని అతడు హామీ ఇచ్చాడు. ఈ నేపథ్యంలో దీపక్‌కు జగదీష్ రూ.30,000 ఇచ్చాడు.

కాగా, అక్టోబర్ 6న ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలిలోని అత్తవారింట్లో తన భార్యను జగదీష్ దించాడు. ఆ మరునాడు ఢిల్లీకి తిరిగి వచ్చాడు. ఫ్రెండ్ దీపక్‌తో ఆ రోజంతా గడిపాడు. ఆ రోజు సాయంత్రం రెండో పెళ్లి కోసం మరో రూ.30,000 చెల్లించాడు. ఆ రాత్రి 11 గంటల ప్రాంతంలో రిథాలాలోని బస్ స్టాండ్ సమీపంలో జగదీష్‌కు దీపక్ ఫోన్ చేశాడు. దీంతో అతడు అక్కడకు చేరుకున్నాడు.

మరోవైపు తనకు వాగ్దానం చేసిన రెండో భార్య మహిళ గురించి దీపక్‌ను జగదీష్ నిలదీశాడు. ఈ సందర్భంగా వీరిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ మహిళ గురించి మరిచిపో లేకపోతే నీ అంతు చూస్తానని దీపక్ బెదిరించాడు. కత్తి తీసి జగదీష్ ఛాతిపై పొడిచాడు. దీంతో ఆత్మరక్షణ కోసం జగదీష్ ప్రయత్నించాడు. ఛాతిలో దిగిన కత్తిని బయటకు తీశాడు. ఆ కత్తితో దీపక్‌పై దాడి చేసి అతడ్ని పొడిచాడు. గాయపడిన దీపక్ అక్కడి నుంచి పారిపోయాడు.

ఈ దాడి గురించి పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతానికి చేరుకున్నారు కత్తి దాడిలో గాయడిన జగదీష్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అతడిపై తొలుత కత్తితో దాడి చేసి దీపక్‌పై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. అక్టోబర్ 10న అతడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. అలాగే నవంబర్ 3న జగదీష్‌ను కూడా ఈ కేసులో అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

# గుండ్రేవుల, వేదవతి ప్రాజెక్టులు పూర్తిచేయాలి



అమరావతి, నవంబర్ 7: కర్నూలు జిల్లాలో వలసలను అరికట్టేందుకు గుండ్రేవుల, వేదవతి, సిద్దేశ్వరం అలుగు ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి, నంద్యాల జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు, కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జె. లక్ష్మీనరసింహ యాదవ్‌లకు వినతి పత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా అనంతరత్నం మాదిగ మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో వలసలు ఆగాలంటే గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రతి వేసవి కాలంలో ఆదోని ప్రాంత ప్రజలు తట్టబుట్టలు సర్దుకొని ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, విద్యార్థుల చదువుకు అంతరాయం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, ఇక్కడి ప్రజలు ఇక్కడ బ్రతకడానికి స్వేచ్ఛ రాలేదు. 2014లో ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తామని, ప్రజల వలసలను అరికడతామని హామీ ఇచ్చి శిలాఫలకం వేశారు. కానీ ఆ తర్వాత పురోగతి కనిపించలేదన్నారు.

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గుండ్రేవుల ప్రాజెక్టు కోసం భూ సర్వే నిర్వహించారని గుర్తుచేశారు. రాజశేఖర్ రెడ్డి ఉండి ఉంటే ఈ ప్రాజెక్టు పూర్తై ప్రజల వలసలు ఆగేవి, అని అనంతరత్నం మాదిగ పేర్కొన్నారు. ప్రాంత ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కి త్వరలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాదయాత్ర చేపట్టాలని విజ్ఞప్తి చేశారని, షర్మిల ఇందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు కోఆర్డినేటర్ కాశీం వలి, పత్తికొండ కోఆర్డినేటర్ బి. క్రాంతి నాయుడు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ నాయుడు, కర్నూలు 11వ వార్డు ఇన్‌చార్జ్ ఎం. సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు రూ.కోటి ఇవ్వాలి

**-కాంగ్రెస్, టిఆర్ఎస్ లదే ప్రాథమిక బాధ్యత**
**-ధర్నా చేసిన వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి**
**-రోడ్డు విస్తరణ వేగవంతం చేయాలి**
**-ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి**

చేవెళ్ల, నవంబర్ 7: రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద టిప్పర్ - ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలో పీఎంఆర్ మెడికల్ కళాశాలలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ప్రమాదం ఏ విధంగా జరిగింది.. ఎక్కడికి వెళుతున్నారు.. వారి కుటుంబ స్థితిగతులు, అందుతున్న చికిత్సపై వాకబు చేశారు.

అనంతరం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. చేవెళ్ల బస్సు రోడ్డు ప్రమాదం జరిగి 19 మంది మృత్యువాత పడడం, 30మందికి పైగా గాయాలు కావడం ఎంతో విచారకరమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదంలో మృతిచెందిన, గాయపడ్డ వారంతా నిరుపేదలేనన్నారు. గాయపడ్డ వారికి మరో ఆరు నెలలు చికిత్సలు, విశ్రాంతి అవసరం. వీరికి ఒక్కొక్కరికి రూ. 10 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ప్రమాదానికి ప్రాథమిక బాధ్యత వహించాలన్నారు. ఎన్ హెచ్ 163 లో నిర్మాణ లోపాలు ఉన్నాయన్నారు.

ఈ రోడ్డు రెండు వైపులా కుంగిపోయింది. దీనివల్ల వాహనచోదకులు రోడ్డు మధ్యలో నుంచి ప్రయాణించేందుకు ప్రయత్నిస్తున్నారు. దీనివల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణకు నిధులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నాయన్నారు. ఎన్జిటిలో మర్రి వృక్షాలను పరిరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కేసు వేశారు. ఈ కేసును ఉపసంహరింపజేయడంలో ఇన్నాళ్లు గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు అలసత్వం వహించాయన్నారు. హెచ్ 163 విస్తరణను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాద బాధితులు ప్రజలు రోడ్డు విస్తరణ చేపట్టాలని తాండూరులో ధర్నా చేశారు. వీరి బాధను ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. కానీ ధర్నా చేసిన 30మందిపై కేసులు నమోదు చేయడం పట్ల ఆమె మండిపడ్డారు. నమోదు చేసిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం ఆమె బస్సు ప్రమాద సంఘటనా స్థలం కు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్శనలో గ్రంధాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, ముస్లిం మైనార్టీ సెల్ జాగృతి రాష్ట్ర అధ్యక్షులు ముస్తఫా తదితరులు ఉన్నారు.

# నార్నూర్ మండలంలో వందేమాతరం గీత ఆలాపన



ఆదిలాబాద్, నవంబర్ 7:వందే మాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్, గాదిగూడ మండలంలో శుక్రవారం అధికారులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా వందేమాతరం ఉద్దేశం, గీతం దేశానికి ఉపయోగపడ్డ తీరును వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో వందేమాతరం ప్రజలను ఏకతాటిపైకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నార్నూర్ ఎంఈవో పవర్ అనిత, గాదిగూడ ఎంపీ ఓ రమేష్, మాజీ జడ్పీటీసీ హేమలత బ్రిజ్జిలాల్, నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేష్, సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేస్రం హన్మంతరావు, దళిత అవార్డు గ్రహీత కొరల మహేందర్, నాయకులు చౌహాన్ యశ్వంత్ రావు, సుల్తాన్ ఖాన్, హైమద్, ఈశ్వర్, మోహన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

# పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి : నీరజ

నల్గొండ, నవంబర్ 7:పాడి రైతులు విధిగా తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని పశు వైద్యాధికారి, గాలికుంటు టీకా నల్లగొండ జిల్లా మానిటరింగ్ అధికారి నీరజ అన్నారు. శుక్రవారం కట్టంగూర్, సత్యనారాయణపురం, పరడ, మల్లారం గ్రామాల్లో కొనసాగుతున్న గాలికుంటు టీకా కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి పాడి రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గాలికుంటు టీకా వేయించడం వల్ల పశువుల్లో వ్యాధి నివారణ తీవ్రతను తగ్గించడంతో పాటు పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు.

పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం తగ్గకుండా టీకా పని చేస్తుందన్నారు. 4 నెలలు పైబడిన వాటికి తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా 7వ విడుత టీకాల పంపిణీ పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం రెండుసార్లు పశువులకు టీకా వేయడం జరుగుతుందని, ఈ నెల 14 వరకు టీకా కార్యక్రమం ఉంటుందని అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కట్టంగూర్, పరడ పశు వైదాధికారులు రవికుమార్, శ్రావణి, ఎల్ఎస్ఏ అరుణ, ఓఎస్ కిరణ్. గోపాలమిత్రలు చెరుకు శ్రీనివాస్, కావాటి యాదగిరి పాల్గొన్నారు.




# స్వాతంత్రోద్యమానికి ఊపిరి పోసిన వందేమాతరం



మక్తల్, నవంబర్ 7: వందేమాతరం అనే నినాదం మన దేశ స్వాతంత్ర్య పోరాటానికి ఊపిరి పోసిందని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాల ప్రధానాచార్యులు బి.కుర్మయ్య (ఃఐబీతీఎజీతిజీష్ట్ర) అన్నారు. కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకూ ప్రజలను స్వాతంత్రోద్యమం వైపు వందేమాతరం పరుగులు పెట్టించిందన్నారు. బంకిమ్ చంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం గేయం యావత్ దేశాన్ని ఉద్యమ స్ఫూర్తితో నడిపించిందన్నారు. ఈ గేయం శుక్రవారం నాటికి 150 ఏళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశ వ్యాప్తంగా నిర్దేశిత సమయంలో ప్రజలందరూ వందేమాతరం ఆలపించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ మేరకు మక్తల్ పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సామూహికంగా వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం స్ఫూర్తిని భావి తరాలకు అందించే బాధ్యత మనందరిది అని అన్నారు.

బ్రిటిషర్లను వందేమాతరం అనే మాటే భయపెట్టిందన్నారు. భారతీయుల నోట వందేమాతరాన్ని పలికితే జైళ్ల పాల్జేశారని గుర్తు చేశారు. బంకిమ్ చంద్ర ఛటర్జీ మన జాతికి అందించిన ఆ గేయంలో ఉన్న శక్తి ప్రతి ఒక్కరూ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనేలా చేసిందన్నారు ఆ గేయంస్ఫూర్తితోనే మనకు ఆంగ్లేయుల నుండి స్వాతంత్రం లభించింది అని ఆయన పేర్కొన్నారు వందేమాతరం ఒకరిలో స్ఫూర్తి కావాలని కుర్మయ్య ఆకాంక్షించారు.

# స్వాతంత్ర్య స్ఫూర్తికి మూలం వందేమాతరం

## -జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం, నవంబర్ 7: స్వాతంత్ర్య స్ఫూర్తికి మూలం వందేమాతరం, మన ఐక్యతకు ప్రతీక వందేమాతరం అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. ఈ రోజు విద్యార్థులు, నయీం అస్మి అన్నారు. అధికారులు, పోలీసులు, ప్రజలు ఒకే వందేమాతరం గీతాలాపన గళంలో ఆలపించడం ద్వారా మన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, శుక్రవారం భీమవరం పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో వందేమాతర గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, భీమవరం శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి పాల్గొన్నారు. విద్యార్థులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొని దేశభక్తి గీతం వందేమాతరంను ఏకస్వరంగా ఆలపించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ.. వందేమాతరం అనేది కేవలం ఒక గీతం కాదు, అది భారతీయుల మనసుల్లో దేశభక్తిని మేల్కొలిపిన ఆత్మీయ నినాదం అని అన్నారు. బంకిమ్ చంద్ర చటర్జీ రచించిన ఈ గీతం స్వాతంత్ర్య ఉద్యమంలో కోట్లాది భారతీయులలో ఆత్మవిశ్వాసాన్ని, త్యాగస్ఫూర్తిని నింపిందన్నారు. వందేమాతరం అనేది మన దేశం పట్ల గల గౌరవం, ప్రేమ, సేవాస్ఫూర్తికి ప్రతీక అని వివరించారు. దేశ ఏకత, ఐకమత్యం ప్రతిబింబించింది అన్నారు. ప్రతి భారతీయుడు ఈ గీతం యొక్క స్ఫూర్తిని అర్థం చేసుకుని దేశసేవలో భాగస్వామిగా మారాలన్నారు.

వందేమాతరం పాడినప్పుడు మన హృదయం గర్వంతో నిండాలి, ఎందుకంటే అది మన భారతీయతకు ప్రతీక అని కలెక్టర్ చెప్పారు. బంకిమ్ చంద్ర చటర్జీ ఇచ్చిన స్ఫూర్తిని గుర్తుచేసుకుంటూ దేశ ఐక్యత కోసం మనమందరం కలిసి నడవాలని ఆమె పిలుపునిచ్చారు.

భీమవరం శాసనసభ్యులు, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ? స్వాతంత్ర్య ఉద్యమకారుల్లో పోరాట స్ఫూర్తిని రగిలించిన గీతం వందేమాతరం. నవంబర్ 7, 2025 నాటికి ఈ గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. మనమంతా కలిసి పూర్తి గేయాన్ని పాడి దేశభక్తిని గర్వంగా చాటుకుందాం అని అన్నారు.

జాతీయ సమైక్యత భావం – ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

జాతీయ సమైక్యత భావంతో దేశ ప్రజల్లో శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించే ఉద్దేశంతో బంకిమ్ చంద్ర చటర్జీ వందేమాతరం గీతాన్ని రచించారని జిల్లా ఎస్పీ అద్నాన్ మాట్లాడుతూ.. వందేమాతరం, జనగణమన గీతాలు భారతీయతను ప్రతిబింబిస్తూ, దేశ ప్రజల్లో ఐక్యతా స్ఫూర్తిని నింపుతున్నాయి. ఈ గీతాలు మనలో దేశాభిమానాన్ని మేల్కొలిపే శక్తిగా నిలుస్తాయి అని పేర్కొన్నారు.

కార్యక్రమంలో ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ రెడ్డి, డీఈవో ఇ. నారాయణ, డిఎంహెచ్వో డా. బి. గీతాబాయి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు. మంగపతిరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి ఆకనలక్ష్మి, సోషల్ వెల్ఫేర్ అధికారి అరుణకుమారి, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి పుష్పరాణి, తహసీల్దార్ రావి రాంబాబు పాల్గొన్నారు.

అలాగే టీడీపీ నాయకులు మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు, ఏపీఐఐసీ డైరెక్టర్ చెనమల్ల చంద్రశేఖర్, ఎఎంసీ వైస్ చైర్మన్ బండి రమేష్, స్థానిక నాయకులు వబిలిశెట్టి రామకృష్ణ, యారంశెట్టి శివకృష్ణ, ఇందుకూరి రామలింగరాజు, గనిరెడ్డి త్రినాథ్, ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు, కారుమూరి సత్యనారాయణమూర్తి, పీఎస్ఎం బాలికొన్నత పాఠశాల విద్యార్థులు, కూటమి నాయకులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం సాధ్యం..

## ఘనంగా నవచేతన పుస్తక ప్రదర్శన ప్రారంభం



హనుమకొండ, నవంబర్ 7: పుస్తక పఠనంతోనే ప్రపంచ విజ్ఞానం సాధ్యమని హనుమకొండ ఏసీపీ పి.నరసింహరావు అన్నారు. శుక్రవారం హనుమకొండ అశోక కాంప్లెక్స్‌లో నవచేతన బుక్ హౌస్‌లో ఘనంగా పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఏసీపీ ప్రారంభించి మాట్లాడుతూ మనిషిని పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దే శక్తి పుస్తకాలకే ఉందని, విద్యార్థిదశ నుంచే పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించుకోవాలన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రముఖ ప్రచురణ సంస్థలకు చెందిన అనేక రకాల పుస్తకాలను తగ్గింపు ధరలతో నవచేతన బుక్‌హౌస్ ద్వారా పాఠకులకు అందించడం అభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బుక్‌హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ.. ఈ పుస్తక ప్రదర్శన ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందని, ఈ పుస్తక ప్రదర్శనలో 10 నుంచి 40 శాతం వరకు ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హనుమకొండ సీఐ మచ్చ శివకుమార్, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, తోట బిక్షపతి, నాయకులు ఎన్.అశోక్ స్టాలిన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎలుగటి తిరుపతిరెడ్డి, న్యాయవాదులు బండి మొగిలి, ఏరుకొండ జయశంకర్, ఎం.సదాశివుడు, జర్నలిస్టులు మంచాల రాజు, ఎండి.ఉస్మాన్‌పాషా, తాండూరు గోపి, పి.కిషోర్‌కుమార్, కుక్కల రాజు, సిబ్బంది అకినెపల్లి రమేష్, టి.సూర్య పాల్గొన్నారు.

# ఐఎఫ్ఎఫ్ఐ గోవాలో నవంబర్ 20-24 వరకు జరిగే వేవ్స్ బజార్‌లో పాల్గొనేందుకు అంకుర సంస్థలకు యాక్సిలరేటర్ వేవ్ఎక్స్ 2025 ఆహ్వానం

న్యూఢిల్లీ, నవంబర్ 7:గోవాలోని ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 2025లో వేవ్స్ బజార్‌లోని ప్రత్యేకమైన అంకుర సంస్థల ప్రదర్శన వేదిక వేవ్ఎక్స్ బూత్‌ల కోసం బుకింగ్‌లను ప్రారంభించినట్లు సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

ఏవీజీసీ–ఎక్స్ఆర్ (యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్, ఎక్స్‌టెండెడ్ రియాలిటీ) వినోద రంగాల్లో అభివృద్ధి చెందుతున్న అంకుర సంస్థలకు అంతర్జాతీయ వేదికను కల్పించడం ఈ కార్యక్రమ లక్ష్యం. దీని వల్ల స్టార్టప్‌లకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశ్రమ నాయకులు, పెట్టుబడిదారులు, ప్రొడక్షన్ స్టూడియోలతో పరిచయం ఏర్పడి సహకారం పొందే అవకాశం లభిస్తుంది.

2025 నవంబర్ 20 నుంచి 24 వరకు జరగనున్న వేవ్స్ బజార్.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న చిత్రనిర్మాతలు, నిర్మాతలు, మీడియా నిపుణులు చురుకుగా పాల్గొనేందుకు ప్రసిద్ధి చెందిన ఐఎఫ్ఎఫ్ఐ ప్రధాన నెట్‌వర్కింగ్ కేంద్రం అయిన ఫిల్మ్ బజార్ సమీపంలో ఉంటుంది.

భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ)ను 1952లో స్థాపించారు. ఇది ఆసియా ఖండంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన చలన చిత్రోత్సవాలలో ఒకటి. ప్రపంచ సినిమాలోని నాణ్యతకు వేదిక. దర్శకులు, కళాకారులు, సినిమా ప్రేమికులందరినీ ఒకే వేదికపై కలుసుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. ఈ ఉత్సవాన్ని ప్రతి సంవత్సరం గోవాలోని పణజిలో నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చలనచిత్ర భాగస్వాములు ఇందులో పాల్గొంటారు. ఇది సృజనాత్మక సహకారం, అవకాశాలకు వేదికగా నిలుస్తుంది. ఐఎఫ్ఎఫ్ఐ 56వ ఎడిషన్ నవంబర్ 20 నుంచి 28 వరకు గోవాలోని పణజిలో జరగనుంది.

వేవ్ఎక్స్ కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభించిన జాతీయ స్థాయి అంకుర సంస్థల అభివృద్ధి, మద్దతు నిచ్చే కార్యక్రమం. ఇది ఏవీజీసీ–ఎక్స్ఆర్, మీడియా–టెక్ రంగాల్లో ఆవిష్కరణలు, పారిశ్రామిక వ్యవస్థాపకతకు ప్రోత్సాహం ఇవ్వడమే లక్ష్యంగా పెట్టుకుంది. ప్రముఖ విద్యా సంస్థలు, పరిశ్రమలు, ఇంక్యుబేషన్ నెట్‌వర్క్‌లతో కలసి పనిచేసే వేవ్ఎక్స్, సృజనాత్మకులు, అంకుర సంస్థలు వాటి ఆలోచనలను విస్తరించేందుకు, వ్యాపారాలను పెంపొందించేందుకు సహకరిస్తుంది. దేశంలో పెరుగుతున్న సృజనాత్మక ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తుంది.

# మన జీవన గమనమే గీతం..

## -గుండెలను హత్తుకునేలా.. మనసును దోచేలా పాటలు..
## -నేటితరం పాటల్లో పూర్తి వైరుధ్యం..
## -విజయవాడలో మొదటిసారి ప్రోగ్రాం..
## -ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా..

అమరావతి, నవంబర్ 7:మనం పాడే పాటల్లోనే జీవం, ఎమోషన్లు ఉంటాయని ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా పేర్కొన్నారు. మన జీవన గమనమే ఒక గీతమని, గుండెలను హత్తుకునేలా, మనసును దోచేలా పాటలు ఉండాలని అభిప్రాయపడ్డారు.

కానీ నేటి తరం పాటల్లో పూర్తిగా వైరుధ్యం కనిపిస్తుందని ఆయన అన్నారు. కాలం మారుతున్నప్పటికీ మూలాలను మర్చిపోకూడదన్నారు.

విజయవాడలో అట్టహాసంగా నిర్వహించిన ఇళయరాజా సంగీత విభావరి కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా మ్యూజిక్ మాస్ట్రో ఇళయరాజా విలేకరులతో మాట్లాడుతూ.. తన జీవితంలో జరిగినవి అన్నీ పాటలే. మాట్లాడటానికి ఎం లేదు అని అన్నారు.

తన పాటలు విని విని ఇంతమంది వస్తున్నారు. ఆ పాటల్లో జీవం, ఎమోషన్ అన్నీ ఉన్నాయి. తన పాటలు గుండెల్లోకి, మనస్సుల్లోకి వెళుతున్నాయి. ప్రతి జీవితంలో తన పాటలు భాగమయ్యాయి అని తెలిపారు.

ఇప్పుడు వస్తున్న పాటలు ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. మెల్ సింగర్ పాడింది ఫీమేల్‌కి తెలియదు, ఫీమేల్ పాడింది మెల్‌కి తెలియదు. డైరెక్టర్‌కే ఏ పాట వస్తుందో తెలియని పరిస్థితి ఏర్పడింది అని వ్యాఖ్యానించారు.

తన కాలంలో 80 మంది ఆర్కెస్ట్రా ఒకేచోట ఉండి పాటలు కంపోజ్ చేసేవాళ్ళమని?. రికార్డ్ టైంలో పాడేవాళ్ళమన్నారు. స్టూడియోలో ఎవరు ఏ పాట పాడాలో తానే రాసి ఇస్తానని




తెలిపారు. రిహార్సల్ చేసి చేసి కరెక్ట్‌గా వచ్చిందని అనిపించినప్పుడే బయటకు విడుదల చేసేవాళ్ళమని తెలిపారు. 60 మంది ఒకే విధంగా కృషి చేస్తే 4 నిమిషాల పాట పూర్తయ్యేదని? ఇప్పుడు మ్యూజిక్ చేసే వాళ్ళు ఒకే లైన్‌లో ఉండడం లేదు అని తెలిపారు.

కొన్ని సందర్భాల్లో శ్రుతులు తప్పుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో మొదటిసారి ఈ ప్రోగ్రాం జరగుతుందని.. ఇక్కడ ప్రోగ్రాం చేయడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది అని ఇళయరాజా అన్నారు.

# మెప్పు పొందేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చింది

## -జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బిజెపి గెలవబోతుందని కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్ నవంబర్ 7 (ఎక్స్ ఒప్రేస్స్ న్యూ స్ ) ముస్లింల మెప్పు పొందేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకొచ్చిందని, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బిజెపి గెలవబోతుందని కేంద్రమంత్రి బండి సంజయ్ స్పష్టం చేసారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బండి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ నేతలు కూడా స్థానికంగా సర్వే నిర్వహించారని బిజెపి కేంద్రమంత్రి బండి సంజయ్ తెలిపారు. ఏ సర్వేకు అనుగుణంగా ఆ పార్టీలు గెలుస్తాయని ప్రచారం చేశారని అన్నారు. బిఆర్ఎస్ స్థాయి పెంచాలని సర్వే సంస్థకు ఆదేశించారని, బిఆర్ఎస్ పార్టీ ఆంధ్రలోని సర్వే సంస్థకు రూ.2 కోట్లు ఇచ్చిందని తెలియజేశారు. రెండు పార్టీలకు గుణపాఠం చెప్పి బిజెపికి అవకాశం ఇవ్వాలని ప్రజల ఆలోచన అని అన్నారు. తెలంగాణలో ఇండియన్ ముస్లిం కాంగ్రెస్ గా పార్టీ పేరు మార్చుకుందని, బిజెపి, ఐఎంసి మధ్య జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో పోటీ జరుగుతుందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒక వర్గం ఓట్ల కోసం తాపత్రయపడుతున్నారని బండి సంజయ్ పేర్కొన్నారు.

# నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలి

## -రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క..

హైదరాబాద్, నవంబర్ 7:కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా బోరబండ డివిజన్ లో ఆమెతో పాటు బిక్కనూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమ్ రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. ఇతర పార్టీలు చెప్పే మాటలు నమ్మి మోసపోవద్దని వారు సూచించారు. వారు నిర్వహించిన ప్రచారానికి విశేష స్పందన లభించింది.

# లింఫాంజియోమాతో బాధపడుతున్న వ్యక్తికి మెడికవర్‌లో శస్త్రచికిత్స విజయవంతం

కొండాపూర్ , నవంబర్ 7: రైట్ నెక్ లింఫాంజియోమా తో 25 ఏండ్లుగా బాధపడుతున్న వ్యక్తికి హైటెక్ సిటీ మెడికవర్ వైద్యులు విజయవంతంగా శస్త్ర చికిత్సను పూర్తి చేసి నయం చేశారు. దవాఖానలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీనియర్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయణ వివరాలను వెల్లడించారు.

నగరానికి చెందిన ఓ వ్యక్తి (40) కి మెడలో కీలకమైన నరాలు, రక్తనాళాలు, అన్ననాళం, శ్వాసనాళం సమీపంలో లింఫాంజియోమా ఏర్పడటంతో ఇబ్బందులకు గురయ్యాడు. గతంలో మూడు సార్లు శస్త్రచికిత్సలు చేసినప్పటికీ, తిరిగి రావడంతో బాధితుడు మెడికవర్ వైద్యులను సంప్రదించాడు.

రోగి పరిస్థితిని పూర్తిగా అంచనా వేసిన అనంతరం డాక్టర్ రాహుల్ లక్ష్మీనారాయణ, కన్సల్టెంట్ జనరల్ సర్జన్ డాక్టర్ వెంకట్ పవన్, అనస్తేషియాలజీ విభాగం హెడ్ డాక్టర్ వేణుగోపాల్ నేతృత్వంలోని బృందం రోగికి అత్యంత క్లిష్టమైన రికన్‌స్ట్రక్టివ్ ఎక్సిషన్ సర్జరీని విజయవంతంగా పూర్తి చేశారు.

ఎ్ర న ం ా వ ృ త్ లింఫాంజియోమాలు సాంకేతికంగా అత్యంత సవాలుతో కూడినవనీ, వీటి ద్వారా తీవ్రమైన రక్తస్రావం, నరాల గాయాలు, అంతర్గత అవయవాల గాయాల ప్రమాదం అధికంగా ఉంటుందని తెలిపారు. రోగి పూర్తిగా కోలుకోవడంతో పాటు ప్రస్తుతం రోగి మెడ కదలికలు సాధారణంగా ఉన్నాయని, ఎటువంటి నరాల బలహీనత ఇతర ఆరోగ్య సమస్యలు లేవని వెల్లడించారు.

# జాతీయ సమైక్యతకు స్ఫూర్తి వల్లభాయ్ పటేల్

## -జిల్లా యువజన అధికారి సుంకర రాము

భీమవరం, నవంబర్ 7:జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా యువజన అధికారి సుంకర రాము అన్నారు. భీమవరంలోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాల భాగంగా శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత చరిత్రలో ఇంతకుముందెన్నడూ లేని విధంగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు అతి పెద్ద ప్రచార యాత్రను నిర్వహించడం జరగుతుందన్నారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో కూడా ఈ యాత్ర త్వరలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వినోద్‌కుమార్ వర్మ మాట్లాడుతూ.. భారత వైవిధ్యాన్ని, స్థానిక సంస్కృతిని ప్రతిబింబించేలా పట్టణాలు, గ్రామాల్లో అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు పాదయాత్రలు నిర్వహించబోతున్నామని వివరించారు.

ప్రచార కార్యక్రమాల భాగంగా యోగా శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, మత్తు రహిత భారత ప్రతిజ్ఞలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ప్రచార యాత్రలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శనలు, స్వచ్ఛత డ్రైవ్స్, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్లు, యువకులు చురుకుగా పాల్గొంటారని చెప్పారు.

# నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా మార్చాలి : పురుషోత్తం నాయక్



మంచిర్యాల , నవంబర్ 7: మంచిర్యాల జిల్లా కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో శుక్రవారం జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో అమ్మకు అక్షరమాల ఉల్లాస్ పై శిక్షణ నిర్వహించారు.

ఈ శిక్షణలో సెర్ప్ సీనియర్ సీఆర్పీలు మండల పరిధిలోని గ్రామ సంఘాల ఆఫీస్ బేరర్స్, విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వయోజన విద్యాశాఖ అధికారితో పాటు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ స్వర్ణలత హాజరై వయోజన విద్యా ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం అమ్మకు అక్షరమాల అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. శిక్షణలో అందరికీ విద్యా ప్రాధాన్యం, వయోజన విద్య వల్ల కలిగే ప్రయోజనాలు, నిరక్షరాస్యతతో కలిగే సమస్యలు, మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమాలపై శిక్షణ అందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ, మండల విద్యాధికారి ముక్తవరం వెంకటేశ్వర స్వామి, వయోజన విద్యాశాఖ డీఆర్పీలు కొండు జనార్ధన్, శాంకరి, డీపీఎం స్వర్ణలత, ఏపీఎం రాజ్ కుమార్, సీనియర్ సీఆర్పీలు, సెర్ప్ సిబ్బంది, మండల సమాఖ్య ప్రతినిధులు, మండల సమాఖ్య సిబ్బంది, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

# హోరాహోరీగా గురుకుల జోనల్ స్థాయి క్రీడా పోటీలు



నల్గొండ, నవంబర్ 7: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 11వ జోనల్ స్థాయి క్రీడలు బాలుర విభాగంలో రెండో రోజు వివిధ పాఠశాలల నుండి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నువ్వా నేనా అన్నట్టు పోటీ పడుతూ హోరాహోరీగా క్రీడలు కొనసాగాయి. అథ్లెటిక్స్ లో అండర్– 14 (100 మీటర్)లో పి.వెంకటస్వామి, ఘన్‌పూర్ (ప్రథమ స్థానం), కె.గణేశ్, అనుముల (ద్వితీయ స్థానం), ఈ.ప్రణీత్ ఘన్‌పూర్ (తృతీయ స్థానం). అండర్ 17 (100 మీటర్)లో వై.ప్రణయ్, భువనగిరి (ప్రథమ స్థానం), హర్షవర్ధన్, తిప్పర్తి (ద్వితీయ స్థానం), ఎం.మహేశ్ (తృతీయ స్థానం). అండర్– 19 (100 మీటర్) విభాగంలో ఎం.స్వామి, తిప్పర్తి (ప్రథమ స్థానం), సి.హెచ్.పవన్, ఘన్‌పూర్ (ద్వితీయ స్థానం), వి.రామ్ చరణ్, అనుముల (తృతీయ స్థానం).

షార్ట్ పుట్ అండర్– 19 విభాగంలో పి.అరవింద్, అనుముల (ప్రథమ స్థానం), వెంకన్న– జనగాం (ద్వితీయ స్థానం), ఎల్.చరణ్– ఘన్‌పూర్ (తృతీయ స్థానం). లాంగ్ జంప్ అండర్ 14 విభాగంలో ఎం.చైతన్య, చండూరు (ప్రథమ స్థానం), కె..గణేశ్, అనుముల (ద్వితీయ స్థానం), డి.చిరంజీవి– అనుముల (తృతీయ స్థానం). ఫుట్‌బాల్ అండర్ 19 ఫైనల్ రాజాపేట జట్టుపై జనగామ జట్టు ఘన విజయం సాధించింది. యాదాద్రి డీసిఓ సుధాకర్, వైస్ ప్రిన్సిపాల్ వేణు ప్రసాద్, క్రీడల సమన్వయకర్త జి.శ్రీనివాస్, పీడీలు వెంకటేశ్వర్లు, కిషన్, శృతి పోటీలను పర్యవేక్షించారు.

